

తిరుమలలో 'తండేల్' బృందం

ఇటీవల విడుదలై విజయాన్నందుకున్న తండేల్ సినిమా బృందం గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శకుడు చందు మొండేటితో పాటూ నిర్మాత అల్లు అరవింద్, బన్నీవాసు, హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయం వెలుపల సినిమా దర్శకుడు చందు మొండేటి మీడియాతో మాట్లాడారు. 'దయచేసి పైరసీలో 'తండేల్' సినిమాను ఎవ్వరు చూడద్దు. పైరసీలో చాలా ఎమోషన్స్ అర్థం కావు. థియేటర్‌కు వచ్చి చూడండి తేడా అర్థమవుతుంది.' అని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. విడుదలకు ముందు నిర్మాత బన్నీవాసు తిరుమలకు వచ్చి అఖండ విజయాన్నివ్వాలని కోరుకున్నారని, స్వామి కరుణించాడని చెప్పారు.అందుకే మొక్కు తీర్చుకునేందుకు వచ్చామన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రేమ సందడి

ప్రేమంటే హృదయాన్ని పారేసుకోవడం కాదు.. నువ్వు లేనప్పుడు నవ్వుని, నువ్వున్నప్పుడు కాలాన్ని పారేసుకోవడం అంటాడో కవి..రెండు అక్షరాల ఈ పదం రెండు మనసులను దగ్గర చేస్తుంది.. రెండు జీవితాలను ముడివేస్తుంది. యవ్వనంలో అడుగుపెడుతున్న..పెట్టిన వారిని ఈ భావన గిలిగింతలు పెడుతుంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు.



8లో

19.46 / 20

ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా సాధించిన పాయింట్లు

- ఏడు నెలల్లో 32 వేలకుపైగా ముఖ్య శాఖల ఫిర్యాదులలో 8వ స్థానం
- ఇతర శాఖలకు నాలుగో స్థానం

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో మన జిల్లా ఎక్కడుంది? ఏయే శాఖల్లో ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలా సమస్యలపై వచ్చే అర్జీల్లో మన జిల్లా స్థానం ఎంత?

- ఇలా గతేడాది జూన్ 15వ తేదీ నుంచీ ఈనెల 6వ తేదీ వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు వివిధ కార్యక్రమాల్లో అందిన సమస్యలపై ప్రభుత్వం విశ్లేషించింది. శాఖల వారీగా అర్జీలను 'లెక్క'కట్టింది. పరిష్కార చర్యలపై దృష్టి పెట్టింది. దీనిపై ఈనెల 11న మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులతో సీఎం చంద్రబాబు అమరావతిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మన జిల్లాకు సంబంధించి వివరాలను పరిశీలిస్తే..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఇతర శాఖల్లో నాలుగో స్థానం

హౌసింగ్‌కు సంబంధించి 359 ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. వ్యవసాయశాఖ పరంగా 170, పౌర సరఫరాలకు సంబంధించి 410, మున్సిపల్ పరిపాలనా శాఖ పరంగా 1002, పంచాయతీరాజ్ శాఖ పరంగా 1235, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు 303, సెర్ప్‌కు సంబంధించి 155 చొప్పున సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల సంఖ్య పరంగా జిల్లా నాలుగో స్థానంలో ఉంది.

23 వేల కుటుంబాల నుంచీ వినతులు

జిల్లాలో 23 వేల కుటుంబాలు ఏదో ఒక సమస్యతో ఇబ్బంది పడుతూ పరిష్కారం కోరుతూ ప్రభుత్వానికి వినతులు పంపుకున్నట్లు తాజా విశ్లేషణ వెల్లడిస్తోంది. హౌస్ హోల్డ్ గ్రీవెన్స్ డిస్ట్రిబ్యూషన్ పేరిట ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో జరిపిన విశ్లేషణతో ఈ అంశాలు వెలుగు చూశాయి. జిల్లాకు సంబంధించి 23,047 కుటుంబాలు కనీసం ఒక సమస్య చొప్పున ఎదుర్కొంటున్నాయి. ఈ కుటుంబాల సంఖ్య పరంగా చూస్తే జిల్లా ఐదవ స్థానంలో నిలిచింది. రెండు మూడు సమస్యలు ఎదుర్కొంటూ ఫిర్యాదులు చేసిన కుటుంబాలైతే 4085 ఉన్నాయి. ఈ కేటగిరీలో జిల్లా 8వ స్థానంలో ఉంది. 371 కుటుంబాలు నాలుగైదు సమస్యలతో సతమతమవుతూ ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశాయి. ఇందులో జిల్లాది తొమ్మిదవ స్థానం. ఆరు నుంచీ పది సమస్యలు భరిస్తూ ప్రభుత్వానికి వినతులు పంపిన కుటుంబాలు 118 వుండగా.. ఈ అంశంలో జిల్లా స్థానం పది. పదికి పైగా సమస్యలు ఎదుర్కొంటూ ఫిర్యాదులు పంపిన కుటుంబాలు 33 ఉన్నాయి. ఈ విషయంలో జిల్లా పదో స్థానంలో నిలిచింది.

ప్రజా ఫిర్యాదుల్లో 8వ స్థానం

ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు వివిధ కార్యక్రమాల కింద 32,780 ఫిర్యాదులు అందాయి. ఈ సంఖ్య పరంగా జిల్లా 8వ స్థానంలో నిలిచింది. రాయలసీమను దృష్టిలో పెట్టుకుని పరిశీలిస్తే చిత్తూరు, కర్నూలు, అన్నమయ్య జిల్లాల తర్వాత తిరుపతిలోనే అత్యధికంగా ప్రజా ఫిర్యాదులు అందాయి. వీటిలో సింహ భాగం రెవెన్యూ శాఖవే. మొత్తం 32,780 ఫిర్యాదుల్లో.. ఒక్క రెవిన్యూ సీసీఎల్ఏకు సంబంధించినవే 22,461 ఉన్నాయి. రెవెన్యూ శాఖలోనే విడిగా సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ సమస్యలపై 13,786 ఫిర్యాదులు అందాయి. సహజంగానే తిరుపతి జిల్లాలో భూ వివాదాలు ఎక్కువగా ఉండటంతో పాటు గత వైసీపీ ప్రభుత్వంలో భూ కబ్జాలు, రికార్డుల తారుమారు వంటి వ్యవహారాలు అధికంగా చోటు చేసుకోవడంతో వీటిపైనే ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలుస్తోంది.

కీలక, పోలీసు శాఖల్లో..

రాష్ట్రం మొత్తం మీద కీలక శాఖలు, పోలీసు శాఖకు సంబంధించి తిరుపతి జిల్లాలోనే ప్రజలు అత్యధికంగా ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. కీలక శాఖల పరంగా అన్నమయ్య, తిరుపతి జిల్లాల నుంచీ ఎక్కువగా ఫిర్యాదులు నమోదయ్యాయి. అదే పోలీసు శాఖకు సంబంధించి పార్వతీపురం మన్యం, తిరుపతి జిల్లాల్లోనే ప్రజలు ఎక్కువగా ఫిర్యాదు చేశారు. ఈ జిల్లా నుంచీ 1878 ఫిర్యాదులు ప్రభుత్వానికి వెళ్లాయి.

సీఎంవోకు అందిన ఫిర్యాదుల్లో నాలుగో స్థానం

సీఎం దృష్టికి వెళితే సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తూ పలువురు ముఖ్యమంత్రి కార్యాలయానికే ఫిర్యాదులు చేస్తున్నారు. ఇలా సీఎంవోకు మన జిల్లా నుంచి 935 ఫిర్యాదులు అందాయి. ఎన్టీయార్ విజయవాడ, గుంటూరు, అన్నమయ్య జిల్లాల తర్వాత నాలుగో స్థానంలో మన జిల్లా నిలిచింది.

ఇదీ జిల్లా స్కోర్ బోర్డు

గతేడాది జూన్ 15 నుంచీ ఫిబ్రవరి 6వ తేది వరకు ప్రజల నుంచీ అందిన ఫిర్యాదుల సంఖ్య, వాటి పరిష్కారాల శాతం ఆధారంగా జిల్లాలకు ప్రభుత్వం పాయింట్లు ప్రకటించింది. ఆ స్కోర్ బోర్డులో మొత్తం వంద పాయింట్లు ఉండగా వాటిని 20 పాయింట్లు చొప్పున ఐదు అంశాల నడుమ విభజించింది. జిల్లాకు సంబంధించి మొత్తం వచ్చిన ఫిర్యాదుల పరంగా 7.07 పాయింట్లు, పరిష్కారానికి సంబంధించి 19.46 పాయింట్లు, పరిష్కారం తాలూకూ నాణ్యతకు 12.87 పాయింట్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు, డిప్యూటీ సీఎం, సీఎం తదితర ముఖ్యుల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారం విషయంలో 17.71 పాయింట్లు, ఆ పరిష్కారాల తాలూకా నాణ్యతకు 7.81 పాయింట్లు చొప్పున లభించాయి. ఇవే అంశాలకు సంబంధించి కేవలం గత నెలలో మాత్రమే పరిశీలిస్తే వరుసగా 3.31, 19.30, 9.76, 17.94, 7.54 పాయింట్లు చొప్పున లభించాయి.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీలత, డాక్టర్ శోభామణి, డాక్టర్ నాగేశ్వరరావు

బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందొద్దు

- చికెన్, గుడ్లు బాగా ఉడికించి తినొచ్చు
- వెటర్నరీ వర్సిటీ డీఆర్ డాక్టర్ శ్రీలత

తిరుపతిరూరల్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూపై ఎలాంటి ఆందోళన వద్దని, బాగా ఉడికించిన చికెన్‌మీట్, కోడిగుడ్లను నిర్భయంగా తినొచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(డీఆర్) ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత స్పష్టం చేశారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ఉభయగోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఎక్కువ కావడంతో చికెన్, కోడి గుడ్లు తినొచ్చో లేదోనన్న సంశయంలో జనం ఉన్నారన్నారు. ఈ వ్యాధి బర్డ్ నుంచి బర్డ్‌కి వ్యాపిస్తుందేగానీ బర్డ్ నుంచి మనుషులకు సోకదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు దేశంలో బర్డ్‌ఫ్లూ వల్ల మనుషులు మరణించిన దాఖలాలు లేవన్నారు. దీనికి టీకా (వ్యాక్సిన్) లేనందున నివారణ చర్యలు మాత్రమే చేపట్టాలని సూచించారు.

వ్యాధి లక్షణాలు

బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల కళ్లు, ముక్కుల నుంచి ద్రవాలు కారడం, తలవాపు, మెడ, కాళ్లు వంకరపోవడం, నరాల సంబంధిత లక్షణాలుంటాయని శ్రీలత వివరించారు. వీటిని చూసిన రైతులు సంబంధిత వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. 'చనిపోయిన కోళ్లను గుంతలు తీసి సామూహికంగా పూడ్చిపెట్టి దానిపై బ్లీచింగ్ చల్లాలి. కుక్కలు, ఇతర జంతువులు ఈ మట్టిని తవ్వకుండా ముళ్ల కంప వేయాలి. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే మిగతా కోళ్ల మరణాల శాతం ఎక్కువగా ఉంటుంది. కోళ్ల ఫారాల్లో సిబ్బందికి పీపీఈ కిట్లు, క్లోరినేటెడ్ మందులను వినియోగించాలి. ఫారాల్లోకి వచ్చే వాహనాలను స్టెరిలైజ్ చేయాలి. వలస పక్షులు రాకుండా చూడాలి' అని ఆమె వివరించారు. ఈ మీడియా సమావేశంలో డీఈ డాక్టర్ శోభామణి, డెయిరీ డీన్ డాక్టర్ నాగేశ్వరరావు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు డాక్టర్ ఆనందరావు, డాక్టర్ రాణీప్రమీల, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జీఆర్‌కే శర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాప్తి ఇలా..

ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు ఏవియన్ ఇన్ఫ్లూయెంజా వైరస్ ద్వారా బర్డ్ ఫ్లూ సోకుతుందని శ్రీలత తెలిపారు. వలస పక్షులు, కంటామినేటెడ్ ఫీడ్ అండ్ వాటర్ ద్వారా ఒకదాని నుంచి మరో దానికి వ్యాప్తి చెందుతుందన్నారు. కోళ్ల సాంద్రత ఎక్కువగా ఉన్న చోట వ్యాధి త్వరగా వ్యాపిస్తుందన్నారు. అధిక ఉష్ణోగ్రతల్లో (34-35డిగ్రీలు) వైరస్ మనుగడ (జీవనం) సాగించదని తెలిపారు.



నాగలాపురం బ్యాంకులో

కొనసాగుతున్న విచారణ

నాగలాపురం, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని ఓ బ్యాంకులో ఉద్యోగి చేతి వాటాన్ని ప్రదర్శించి రూ.2 కోట్ల మేర నగలు గోల్‌మాల్ చేసిన వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారం గురించి 'నాగలాపురంలో లక్ష్మీభాస్కర్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం బయటపెట్టిన విషయం తెలిసిందే. ఈ అక్రమాలపై బ్యాంకులో ఉన్నతాధికారుల బృందం విచారణ లోతుగా జరుపుతున్నట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. దీనిపై బ్యాంకు అధికారులను వివరణ కోరగా.. బ్యాంకులోని నగలు భద్రంగా ఉన్నాయంటూ పొంతనలేని సమాధానం చెబుతూ అసలు విషయాలను దాటవేసే ప్రయత్నం చేశారు. కాగా నగల వ్యవహారంపై పోలీసులను కూడా బ్యాంకు అధికారులు సంప్రదించినట్లు సమాచారం. న్యాయ నిపుణల సలహా మేరకు ఈ ఘటనపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్న అంశంపై యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

బ్యాంకు అధికారులపై వేటు

నగల గోల్‌మాల్ వ్యవహారంలో పలువురు బ్యాంకు సిబ్బందిపై వేటుపడే అవకాశమున్నట్లు కనిపిస్తోంది. ఇందులో భాగంగా బ్యాంకులో కీలకంగా ఉన్న ఇద్దరిలో ఒకరిని ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు, తాజాగా మరొకరిని కూడా విధుల నుంచి దూరం పెట్టినట్లు తెలిసింది. ఈ ఘటనలో వీరి ప్రమేయం ఎంత వరకు ఉంది, ఏమేరకు అక్రమాలకు పాల్పడ్డారన్న విషయంపై ముమ్మరంగా విచారణ జరుపుతున్నారు. ఈ విచారణ మరో మూడు రోజులు కొనసాగుతుందని, పూర్తయిన వెంటనే మీడియాకు వెల్లడిస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు.

బాలాజీ రిజర్వాయరుపై కసరత్తు

- ఏపీ జలవనరులశాఖ సలహాదారు కన్నయ్యా నాయుడు



పాపవినాశనం జలాశయ గేట్లను పరిశీలిస్తున్న కన్నయ్య నాయుడు

తిరుమల, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): 'కృష్ణా నీటిని కుప్పం వరకు తీసుకువచ్చేలా చాలా ప్రతిపాదలను పెట్టాం. మధ్యలో చాలా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు వచ్చాయి. ప్రభుత్వ నిధులను బట్టి ఒక్కొక్కటిగా నిర్మాణం చేపడుతూ వస్తోంది. వీటిలో బాలాజీ రిజర్వాయర్ కూడా ప్రాధాన్యంలో ఉంది. దీనికి అధికారులు కసరత్తు చేస్తున్నారు' అని ఏపీ జనవరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు తెలిపారు. తిరుమలలోని పాపవినాశనం, గోగర్భం డ్యామ్‌ల పటిష్ఠత, గేట్లను తన బృందంతో కలిసి గురువారం పరిశీలించిన ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ప్రాజెక్టులు త్వరగా పూర్తవుతాయన్నారు. ఇక, తిరుమలలో నీటి సమస్య లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాళంగి ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 0.2 టీఎంసీ నుంచి 2 టీఎంసీలకు పెంచేందుకు సర్వే పూర్తయిందన్నారు. ఇందులో నాలుగు గ్రామాల్లో భూసేకరణ పూర్తయితే జలాశయం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ నీటిని తిరుపతికి వాడుకుంటే.. నగర సమీపంలోని అన్ని డ్యాముల నీటిని తిరుమలకు తీసుకెళ్లడం ద్వారా భక్తులకు నీటి ఇబ్బందులు ఉండవన్నారు.

పోలీసు శాఖలో ప్రక్షాళన!

- తొలి దశలో స్పెషల్ బ్రాంచ్‌పై దృష్టి పెట్టిన ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ప్రక్షాళన దిశగా ఎస్పీ హర్షవర్ధనరాజు చర్యలు చేపట్టారు. మొదటగా స్పెషల్ బ్రాంచ్‌పై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో సీఐ శ్రీనివాసులును తిరుపతి ట్రాఫిక్‌కు నియమిస్తూ గురువారం అటాచ్‌మెంటు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు మెడికల్ సెలవుపై ఉన్న షాదిక్ ఆలీని స్పెషల్ బ్రాంచ్ సీఐగా నియమించారు. ఇక, మిగతా అధికారులు, సిబ్బంది బదిలీలపై దృష్టి పెట్టనున్నారు. ప్రధానంగా రాజకీయ పరిణామాలు, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు, పేకాట తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంలో కొందరు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు విఫలమయ్యారయే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో తిరుపతి ఎస్పీలోని మరో కీలక అధికారి బదిలీ జరిగే అవకాశముందని పోలీసు వర్గాల్లో వినిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎస్‌బీలో పనిచేస్తున్న కానిస్టేబుళ్ల తీరుపైనా తీవ్రస్థాయిలో విమర్శలు.. ఫిర్యాదులు ఉన్నాయి. ఇప్పటికే ఒకసారి హెచ్చరించిన ఎస్పీ.. ప్రస్తుతం చర్యలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలోని ఓ స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఇసుక మాఫియాకు.. మరికొందరు కోడి పందేల నిర్వాహకులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పెద్ద హోటళ్ల యజమానులతో ఒప్పందం కుదుర్చుకుని విమానాశ్రయంలోని కొందరు ట్రావెల్స్ నిర్వాహకులతో టైఅప్ చేసుకుని తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాల్లో దర్శనాలు చేయిస్తానంటూ ఓ కానిస్టేబుల్ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ ఎస్‌బీ కానిస్టేబుల్‌కు బంధువులైన ఇద్దరు కానిస్టేబుళ్లపైనా ఆరోపణలున్నాయి. వీరిలో ఒకరు ఇసుక మాఫియాతో చేతులు కలిపినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో హైవే పెట్రోలింగ్‌లో పనిచేసిన కానిస్టేబుల్‌పైనా ఫిర్యాదులున్నాయి. తూర్పు మండలాల్లోని ఓ పోలీసు అధికారి లారీలు పెట్టుకుని చెన్నై, కోయంబేడు, తిరువళ్లూరు, తిరుత్తణికి ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఓ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు.. ఆ అధికారి పేరు చెప్పుకొని సెటిల్‌మెంట్లు, ఆర్థిక దందాలు, భూ సమస్యలు, భార్యాభర్తల తగాదాల్లో తలదూర్చి నిందితులకు కొమ్ముకాస్తున్నారని సమాచారం. వీటన్నింటిపైనా దృష్టి పెట్టిన ఎస్పీ.. ప్రక్షాళనదిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

ఎంసీఏ, ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహించిన ఎంసీఏ, ఎల్ఎల్‌బీ (3, 5 ఐదేళ్ల కోర్సుల) నాల్గవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు సీఈ దామ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో 18 ఫిర్యాదులు


ఫిర్యాదులు తీసుకుంటున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి

పాకాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారవేదిక, తిరుపతి రూరల్ డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణములో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. విశ్రాంత న్యాయమూర్తి వి.శ్రీనివాస అంజనేయమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అదాలత్‌లో వివిధ సమస్యలపై వినియోగదారులు 18 మంది ఫిర్యాదు చేశారు. అప్పటికప్పుడే ఏడు ఫిర్యాదులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్థిక సభ్యుడు కె.రామ్మోహన్‌రావ్, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, తిరుపతి రూరల్ ఈఈ ఎం.చిన్నరెడ్డప్ప, పాకాల డిప్యూటీ ఈఈ వి.జీవనకుమార్, ఎఈ ఎల్.ప్రశాంత్, ఎఈఆర్ ఎం.హరిప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లకు శిక్షణా తరగతుల ప్రారంభం



ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు మూడేళ్ల వరకు నవచేతన్ కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం అందిస్తే మానసిక వికాసానికి తోడ్పడుతుందని మాత శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు భారతి అన్నారు. స్థానిక జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈసందర్భంగా భారతి మాట్లాడుతూ 3-6 సంవత్సరాల పిల్లలకు బలవర్ధకమైన ఆహారంతో ప్రారంభ విద్యను అందించి రెగ్యులర్ చదువుకు సంసిద్ధం చేయాలన్నారు. నవచేతన్, పోషన్ అభియాన్ కార్యక్రమాలు ప్రారంభ విద్యను బలోపేతం చేస్తాయన్నారు. అంగన్వాడీ టీచర్లు చొరవ తీసుకోవాలని కోరారు. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లులో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ భీ-పడాయి భీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎ.రంగంపేట హైస్కూల్‌ను సందర్శించిన డీపీవో


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీపీవో సుశీలాదేవి

చంద్రగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):ఎ.రంగంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీపీవో సుశీలాదేవి గురువారం సందర్శించారు. ఈ పాఠశాలను శ్రీసిటీ దత్తతకు తీసుకుని వచ్చే విద్యా సంవత్సరానికి మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించింది. ఈ క్రమంలోనే అధునాతన సౌకర్యాల కల్పనకు, ఆధునిక విద్యను అందించడానికి సుశీలాదేవితో పాటు శ్రీసిటీ ప్రతినిధులు సందర్శించారు. పాఠశాలలో కావాల్సిన మౌలిక వసతులు, సాంకేతిక పరికరాలు తదితర అంశాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సర్వేలపై అసంతృప్తి


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న నారాయణరెడ్డి

చంద్రగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలో 1,2 సచివాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సర్వేలు సక్రమంగా జరగడంలేదని డీఎల్‌డీవో నారాయణరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసారు. గురువారం ఈ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ సర్వేలు సరిగ్గా జరగడంలేదన్నారు. మిస్సింగ్ సిటిజన్స్, చిన్న తరహా షాపుల జియో ట్యాగింగ్ చేయడం లేదన్నారు. వెంటనే సర్వేలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో శేఖర్, పంచాయతీ ఈవో మహేశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు వివరాల నమోదు ప్రక్రియ పరిశీలన


ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న మురళీ

భాకరాపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రైతులు తమ వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ కోరారు. దిగవూరు పంచాయతీలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28వ తేదీలోపు రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతుల ప్రయోజనాల కోసం 11 అంకెలతో కూడిన యూనికోడ్‌ను కేటాయిస్తున్నాయన్నారు. దీని ద్వారా పీఎం కిసాన్ పంట రుణాలు, ఇతర సబ్సిడీ పథకాలు అందజేస్తారన్నారు. ఏవో ధనలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంటు బెంచీలకు రంగులు వేయడంపై వివాదం


సిమెంటు బెంచీలకు వేసిన రంగులు

పాకాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుడా నిధులతో వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలకు రంగులు వేయడంపై దామలచెరువు పంచాయతీ బందార్లపల్లెలో గురువారం గొడవ జరిగింది. తుడా నిధులతో ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేరును ఎన్నికల ప్రచార సమయంలో కొన్నిచోట్ల కనిపించకుండా చేశారు. కొన్ని గ్రామాల్లో అలాగే వుండిపోయాయి. దామలచెరువు పంచాయతీ బందార్లపల్లెలో గురువారం పంచాయతీ సిబ్బంది సిమెంటు బెంచీలకు రంగులు వేస్తుండగా వైసీపీ పేర్లు చెరపవద్దంటూ కొందరు గ్రామస్థులు గొడవకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకొని కొందరిని అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసుల జోక్యంతో ఈవివాదం సద్దుమణిగింది. అదుపులోకి తీసుకున్నవారిని తిరిగి ఇంటికి పంపేసినట్లు సమాచారం.

కల్యాణ వెంకన్నకు పరదాల విరాళం



చంద్రగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయానికి తిరుపతికి చెందిన మణి రెండు పరదాలు, రెండు కురాళాలు విరాళంగా అందించారు. బ్రహ్మోత్సవాల్లో వీటిని వినియోగించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకశ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు శేషాచార్యులు, బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు, సూపరింటెండెంట్‌లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఇన్స్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాయల చెరువును పరిశీలించిన అధికారులు

రామచంద్రపురం,ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):రాయలచెరువును ఇర్రిగేషన్ ఎస్ఈ వెంకటరమణరాజు, ఈఈ వెంకటప్రసాద్‌లు గురువారం పరిశీలించారు. పెద్దెటివంక, రాయలచెరువుపేట, ఫీడర్ చానల్స్ ఆక్రమణలను తొలగించాలని, సప్లై చానల్స్‌ను మరమ్మతులు చేయాలని నీటిపారుదల సంఘాల అధ్యక్షుడు కే.అర్జున్‌నాయుడు ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. రాయలచెరువుకు అభివృద్ధితోపాటు మొరవ ఏర్పాటు చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి కోరారు. నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తిరాజు, రాయలచెరువు నీటి సంఘాల ఉపాధ్యక్షుడు కుప్పా త్యాగరాజు, నీటిపారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా

● ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన హరిష్

చంద్రగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు బుధవారం రాత్రి చంద్రగిరి భారతీనగర్‌కు చెందిన హరీష్, కొప్పరవాండ్లపల్లెకు శ్రావణ్‌లు ద్విచక్ర వాహనంపై చంద్రగిరికి వస్తున్నారు. దారిలో పీఎల్ఆర్ క్యాండీ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో హరీష్‌కు తలకు తీవ్ర గాయమైంది. శ్రావణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అధ్యాపకురాలు రేఖకు డాక్టరేట్



పాకాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు .రేఖ డాక్టరేట్ అందుకున్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం(అనంతపురం) ఈ డాక్టరేట్ ప్రధానం చేసింది. ఆర్.జీవన్ కుమార్ పర్యవేక్షణలో అల్ట్రాసోనిక్ వెలాసిటీస్ అండ్ రిలేటెడ్ పారామీటర్స్ ఇన్ సండ్ ఎడిబుల్ ఆయిల్స్ హేస్ ఏ ఫంక్షన్ ఆఫ్ ఫ్రీక్వెన్సీ అండ్ టెంపరేచర్ అనే అంశంపై ఆమె పరిశోధన సమర్పించారు. రేఖను ప్రిన్సిపాల్ మోహిద్దీన్ బాషా, అధ్యాపకులు అభినందించారు.

ఈడిగ గౌడసంఘం కార్యవర్గం ఎన్నిక

పాకాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల ఈడిగ గౌడసంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.శ్రీనివాసులు, కార్యదర్శిగా జి.గోపి, కోశాధికారిగా డి.కుమార్, గౌరవాధ్యక్షుడిగా పి.సోమశేఖర్, గౌరవ సలహాదారుడిగా వి.గోపి, ఉపాధ్యక్షుడిగా ఎం.మోహన్, ప్రధాన కార్యదర్శిగా టి.గురుదేవ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చెంగయ్య, దిండుపాటి కుమారస్వామి, టి.మురళి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు


మోపిదేవి వెంకటరమణ- సుడిగాలి సుధీర్

తిరుమల, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ, నటుడు సుడిగాలి సుధీర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

గొల్లపల్లెలో రీసర్వే పనుల తనిఖీ


సర్వేయర్లతో మాట్లాడుతున్న రామాంజులునాయక్

తిరుపతి రూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లెలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన రీసర్వేను రూరల్ తహసీల్దార్ రామాంజులు నాయక్ గురువారం తనిఖీ చేశారు. పొలాల హద్దులు నిర్ధారణ పనులను పరిశీలించి సర్వేయర్లతో మాట్లాడారు. పనులను పారదర్శకంగా, త్వరితగతిన చేపట్టాలని వారికి కొన్ని సూచనలు చేశారు.

నిధులున్నా అసంపూర్తిగా గదుల నిర్మాణం



పునాదులకే పరిమితమైన తరగతి గదుల నిర్మాణం- మధ్యలో నిలిపేసిన గదుల నిర్మాణ పనులు

పాకాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి మంజూరైన నిధులు మురిగిపోయాయి పూర్వ విద్యార్థులు, దాతలు అభివృద్ధికి చేసిన కృషి, కల్పించిన సౌకర్యాలు సద్వినియోగం కాలేదు. ప్రస్తుతం తెలుగు ఇంగ్లీషు మీడియంలలో 700లోపు విద్యార్థులు ఉన్నారు. మూడేళ్ల క్రితం అదనపు తరగతి నిర్మాణానికి నాబార్డు నిధులు రూ.2 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో పునాదులు వేశారు. ఇప్పటికీ ఈ పనులు పునాది దశ దాటలేదు. మరో మూడు గదుల నిర్మాణం అసంపూర్తిగా మిగిలి ఉంది. రెండేళ్ల క్రితం నాడు-నేడు రెండవ దశలో 13 అదనపు గదుల నిర్మాణానికి రూ.1.93 కోట్లు మంజూరయ్యాయి. రెండవ అంతస్థుపై నిర్మాణాలు గోడలకే పరిమితమయ్యాయి. నాసిరకం నిర్మాణాలని స్లాబు వేయడానికి ఇంజనీరింగ్ అధికారులు అభ్యంతరం చెప్పినట్లు సమాచారం. నాడు-నేడులో మంజూరైన నిధులు, నాబార్డు నిధులు రూ.3.93 కోట్లు సక్రమంగా సద్వినియోగం చేసుకోకపోవడంతో వృథా అయ్యాయి. ఇప్పటికే ఉన్న గదులకు మరమ్మతులు చేసినా సరిపోయేది. నిర్మాణాలు చేపట్టి అర్థాంతరంగా వదిలేయడంపై పిల్లల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

నీరు- చెట్టు బిల్లులకు జీఎస్టీ భారం

● పనులు చేసేటప్పుడు లేని ట్యాక్స్ తర్వాత ఖచ్చితం చేసిన వైనం

● 18 శాతం చెల్లించక తప్పని దైన్యం

చిత్తూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్లు నీరూచెట్టు బిల్లులకు జీఎస్టీ భారం పడింది. పనులు చేసేటప్పుడు జీఎస్టీ లేకపోవడం, ఆ తర్వాత ఈ విధానం అమలులోకి రావడంతో ఈ కష్టాలు మొదలయ్యాయి. ఏళ్లుగా పెండింగులో ఉన్న బిల్లుల్ని మంజూరు చేసేందుకు అధికారులు ప్రాసెస్ చేస్తుండగా.. 18 శాతం జీఎస్టీనీ కలపాల్సి వస్తోంది. పెండింగ్ బిల్లుల కోసం ఇన్నాళ్లు నిరీక్షించిన కాంట్రాక్టర్లు ఈ జీఎస్టీ భారంపై ఆవేదన చెందుతున్నారు. అధికారులు వర్క్ ఎస్టిమేట్ పెంచి అందులో నుంచి జీఎస్టీని మినహాయిస్తామని చెప్తున్నా.. టెక్నికల్‌గా మాత్రం కాంట్రాక్టరుకు రావాల్సిన నిధుల నుంచే కేటాయించాల్సి వస్తోంది. 2017 జూలై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. అంతకు ముందు 4 శాతం వ్యాట్‌ను చెల్లించే కాంట్రాక్టర్లు.. అప్పటి నుంచి అగ్రిమెంటు అయిన పనులకు 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది.

2950 పనులకు రూ.166 కోట్ల బిల్లుల పెండింగు

చెరువులు, చెక్‌డ్యామ్ వంటి జలవనరుల్ని అభివృద్ధి చేసేందుకు 2015-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 'నీరు-చెట్టు' పథకం కింద పెద్దఎత్తున పనుల్ని చేపట్టింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీ పీ ప్రభుత్వం 'నీరు-చెట్టు' పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఉద్దేశపూర్వకంగా బిల్లుల్ని ఆపేసింది.తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పెండింగ్ బిల్లుల్ని మంజూరు చేయమని ఆదేశించింది. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2950 పనులకు సంబంధించిన రూ.166 కోట్ల బిల్లులు మంజూరు కావాల్సి ఉన్నాయి.జలవనరుల శాఖ అధికారులు ప్రస్తుతం బిల్లుల్ని అప్లోడ్ చేస్తున్నారు. ఆయా బిల్లుల్ని ప్రాసెస్ చేసి, జీఎస్టీతో కలిసి అప్లోడ్ చేయడానికి సుమారు మరో మూడు నాలుగు నెలలు పట్టే అవకాశం ఉంది.

రూ.1.88 లక్షల జీఎస్టీ భారం..

సోమల మండలంలో చెక్‌డ్యామ్ మరమ్మతుకు 2017లో జలవనరుల శాఖ అధికారులు రూ.22 లక్షలతో టెండర్ పిలిచారు. అదే మండలానికి చెందిన టీడీపీ నేత ఆ పనిని తక్కువ ధరకు రూ.17.66 లక్షలకు టెండర్‌ను దక్కించుకున్నారు. 2017లోనే పనులు పూర్తి చేశారు. జీఎస్టీ అమలులోకి రాకముందే కొంత మేర బిల్లులు వచ్చినా.. సుమారు రూ.10 లక్షలకుపైగా పెండింగు పడింది. ఇప్పుడు బిల్లుల మంజూరుకు ప్రక్రియ ప్రారంభమైంది. పనులు చేసినప్పుడు లేని జీఎస్టీ విధానం ఇప్పుడు ఉండడంతో.. 18 శాతం అంటే రూ.1.88 లక్షలు కేటాయించాల్సి వస్తోంది. సుమారు 8 ఏళ్లుగా అతను బిల్లుల కోసం వేచి ఉండగా.. ఇప్పుడేమో రావాల్సిన బిల్లులో జీఎస్టీ తప్పనిసరి అంటున్నారు.

పెండింగ్ బిల్లు కంటే జీఎస్టీనే అధికం

ఎస్ఆర్‌పురం మండలంలో ఓ టీడీపీ సానుభూతిపరుడు 2017లో రూ.10 లక్షల విలువ చేసే నీరు చెట్టు పనులు చేశారు. అప్పట్లోనే రూ.9 లక్షల వరకు బిల్లులు వచ్చేశాయి. మిగిలిన రూ.లక్ష పెండింగులో ఉండగా.. ఇప్పుడు బిల్లు పెట్టాలంటే ఇదివరకే చెల్లించిన రూ.9 లక్షలకు కూడా జీఎస్టీ కలుపుకోవాల్సి వస్తోంది. వచ్చే పెండింగ్ బిల్లు కంటే చెల్లించాల్సిన జీఎస్టీ అధికంగా కావడంతో ఆ కాంట్రాక్టరు రూ.లక్ష పెండింగు బిల్లును వదులుకునేందుకు సిద్ధపడ్డారు.

ఆర్థికంగా చితికిపోయిన కాంట్రాక్టర్లు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటివరకు టీడీపీ అమలు చేసిన అనేక పథకాలు, కార్యక్రమాలు ఆపేసింది. అన్న క్యాంటీన్లు ఎత్తేసింది. టిడ్కో గృహాలను పక్కన పెట్టేసింది. పండుగ కానుకలు, పెళ్లి కానుకలు రద్దు చేసిందినీరు-చెట్టు పనులన్నీ టీడీపీ సానుభూతిపరులు చేశారనే కారణంతో ఉద్దేశపూర్వకంగా బిల్లుల్ని ఆపేసి విజిలెన్సు విచారణకు ఆదేశించింది. దీంతో నీరూచెట్టు పనులు చేసిన వారంతా ఆర్థికంగా చితికిపోయారు.అప్పులు చేసి పనులు చేపట్టిన వారంతా సుమారు ఏడేళ్ల పాటు వడ్డీలు కట్టుకోవాల్సి వచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 250 మంది మాత్రం పెండింగు బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించగా.. వారిలో కొందరికి తప్పనిసరి పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం బిల్లుల్ని చెల్లించింది.

ఎల్అండ్‌టీతో ఎంవోయూ కుదుర్చుకున్న ఎంబీయూ


ఫెబిన్‌ను సన్మానిస్తున్న ఎంబీయూ సిబ్బంది

చంద్రగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు యూనివర్శిటీ, ఎల్అండ్‌టీ కంపెనీ ఎడ్యుకేట్ ఇండియా థీమ్‌ను అనుసరించి గురువారం ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎల్అండ్‌టీ కళాశాల అధిపతి ఫెబిన్ ఎంబీయూను సందర్శించి ఎడ్యుకేట్ ఇండియా ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పారిశ్రామికి అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శ్రీవిద్యానికేతన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఈడీ వినయ్ మహేశ్వరి మాట్లాడుతూ ఎంబీయూలో విద్యార్థులకు కావలసిన అన్ని సదుపాయాలను ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొవోస్ట్ ప్రొఫెసర్ నాగరాజ్‌రామరావ్, వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కరుణాకరన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సారథి, డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు. విద్యార్థులు ఒప్పందం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేయాలని కోరుతూ..

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశానికి చేపడుతున్న ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేసి, పీజీ అడ్మిషన్ల నిర్వహణ బాధ్యతను యూనివర్సిటీలకే అప్పగించాలనే ప్రధాన డిమాండ్‌తో విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఎస్వీ యూనివర్సిటీలోని అన్నమయ్య భవన్ లో ఈ సమావేశం ప్రారంభం కానుంది. ఉమ్మడి పీజీ సెట్ వల్ల యూనివర్సిటీల్లోని పీజీ కోర్సుల్లో అడ్మిషన్ల సంఖ్య భారీగా తగ్గిపోయిందని ఎస్ఎఫ్ఐ ఎస్వీ యూనివర్సిటీ కన్వీనర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. దీనివల్ల గొప్ప చరిత్ర కల్గిన విభాగాలు మూతపడే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.

భర్తను హత్య చేసి.... ఆపై కనపడలేదంటూ ఫిర్యాదు చేసి


మృతుడు బి.రెడ్డెప్ప (ఫైల్ ఫొటో)

● రెండేళ్లనాటి కేసును ఛేదించిన పోలీసులు


దోషులను అరెస్టు చేసిన సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ నరసింహులు

ఐరాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) :రెండేళ్ల క్రితం భర్తను హత్య చేసిన మహిళతో పాటు ఆమె ప్రియుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కథనం మేరకు....2023వ సంవత్సరం జనవరి7న ఐరాల పంచాయతీ నయనంపల్లెకు చెందిన బి.కామేశ్వరి తన భర్త బి.రెడ్డెప్ప(41) కన్పించడం లేదంటూ ఐరాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులకు దర్యాప్తులో బి.కామేశ్వరికి కంచవారిఇండ్లుకు చెందిన కె.సుధాకర్‌తో సంబంధం ఉన్నట్లు తెలిసింది.దీంతో పోలీసులు ఈ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు.ఇద్దరినీ అరెస్టు చేసి విచారించగా నేరం ఒప్పుకున్నారు.తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఆమె ప్రియుడితో కలసి భర్తను చంపాలని పథకం రచించింది.2022వ సంవత్సరం నవంబరు 17వ తేదీన రాత్రి ఇద్దరూ కలసి ఇంటి వద్ద వున్న రెడ్డెప్ప తలపై బండ రాయితో మోది హత్య చేశారు. శవాన్ని టార్పాలిన్ పట్టలో మూటకట్టి గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న వ్యవసాయ బావిలో పడవేశారు. టార్పాలిన్ పట్టలో బండరాళ్ల వేసి, అలాగే పట్ట వెలుపల నాలుగు వైపులా పెద్ద రాళ్లతో కట్టి బావిలో వేయడంతో ఈ విషయం బయటికి తెలియ లేదు.రెండు నెలల తరువాత ఏమీ ఎరగనట్లు తన భర్త కన్పించడం లేదంటూ కామేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం నేరాన్ని ఒప్పుకున్న కామేశ్వరి,సుధాకర్ తాము రెడ్డెప్ప శవాన్ని ఏ బావిలో పడవేశారో పోలీసులకు చూపించారు. సీఐతో కలసి ఐరాల ఎస్ఐ నరసింహులు గురువారం ఆ బావి వద్దకు వెళ్లి రెడ్డెప్ప అస్థిపంజరాన్ని బయటకు తీశారు.దాన్ని చూసి రెడ్డెప్ప బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

10 టన్నుల రేషన్ బియ్యం సీజ్



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు పంపిణీ చేసేందుకు కేటాయించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా గోదాములో నిల్వచేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్వో శంకరన్ కథనం మేరకు...చిత్తూరు సమీపంలోని మురకంబట్టు బైపాస్‌లో బద్రీనాథ్ అనే వ్యక్తికి చెందిన గోదాములో రేషన్ బియ్యాన్ని నిల్వచేస్తున్నట్లు డీఎస్వో కార్యాలయానికి ఫోన్ ద్వారా సమాచారమందింది. దీంతో డీఎస్వో శంకరన్ ఓ బృందాన్ని ఏర్పాటు చేసి అక్రమంగా నిల్వచేస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకోవాలని ఆదేశించారు.డీటీలు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పయని, చిత్తూరు అర్బన్ ఆర్ఐ సతీష్ తదితరులతో కూడిన బృందం గోదాము వద్దకు వెళ్లారు. అదేసమయంలో ఆటోలో నుంచి గోదాములోకి తరలిస్తున్న పది టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఇది తెలిసిన వెంటనే గోడౌన్ యజమాని బద్రీనాథ్, ఆటోడ్రైవరు పరారయ్యారు. 6ఏ కేసును నమోదు చేసినట్లు డీఎస్వో తెలిపారు.

వేడుకగా దోపు ఉత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలో దోపు ఉత్సవం వేడుకగా జరిగింది. ముందుగా ఆలయ అలం కార మండపంలో పంచమూర్తులను అర్చ కులు విశేషంగా అలంకరించి హారతు లను సమర్పించారు. అనంతరం భిక్షాల గాలి గోపురం నుంచి సంప్రదాయబద్ధంగా దోపు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లతోపాటు శివ పరివార ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. భక్త లు దర్శించుకుని కర్పూర హారతులు సమ ర్పించారు. ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.



కాలం చెల్లిన బస్సులకు ఎట్టకేలకు విముక్తి

స్క్రాప్ కింద మొదటి విడతలో ఏడింటికి వేలం పూర్తి - మిగిలిన ఐదింటికి కసరత్తు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో పాడైన వాహనాలస్క్రాప్ తరలింపునకు రంగం సిద్ధం చేశారు. ఆక్షన్ ప్రక్రియ పూర్తయిన 7 వాహనాలు రేపోమాపో తరలిపోనున్నాయి. 2004నుంచి 2011 మధ్యలో కొనుగోలు చేసిన 12 బస్సులు(వోల్వో, నాన్ ఏసీ, మినీ బస్సులు) 15 ఏళ్ల కాలపరిమితి పూర్తవడం, కొన్ని భాగాలు పాడైపోవడంతో 2019నుంచే పక్కన పెట్టేశారు. జూపార్కు రోడ్డులోని డిపో వద్ద నిరుపయోగంగా పడివుండడాన్ని గుర్తించిన అధికారులు ఆక్షన్ ద్వారా స్క్రాప్‌కు పంపి ఎంతో కొంత సొమ్ము చేసుకోవాలని నిర్ణయించారు. 2023లో ప్రారంభించిన ఆక్షన్ ప్రక్రియ గతేడాది నవంబరు వరకు సాగింది. తొలి విడతలో ఏడు బస్సులకు నిర్వహించిన ఆక్షన్ ద్వారా రూ.21.8లక్షలు సమకూరింది. రెండో విడతలో మిగిలిన ఐదు బస్సులను ఆక్షన్ వేయడానికి కసరత్తు జరుగుతోంది. దీనిద్వారా సంస్థకు దాదాపు రూ.15 లక్షలు సమకూరే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నా రు. ఈ ప్రక్రియ సకాలంలో చేపట్టిఉంటే మరింత రాబడి లభించేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం 17 బస్సులు అందుబాటులో ఉండగా వోల్వో 6, బెంజ్ నాన్ ఏసీ 3, బెంజ్ ఏసీ 2, హైటెక్ నాన్ ఏసీ 6 బస్సులు వివిధ పర్యాటక ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇవన్నీ 2015నుంచి 2018మధ్యలో కొనుగోలు చేసినవే.



వేలం పూర్తయిన వాహనాలు

పట్టించుకోండి సారూ..!

ముళ్లపొదల మాటున మరుగుదొడ్లు



రుయాస్పత్రికి వచ్చే రోగుల కోసం ఓపీ కేంద్రం వెనుక ప్రత్యేక మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. వీటిచుట్టూ దట్టమైన ముళ్లపొదలు అల్లుకుపోవడంతో ఉపయోగించుకునేందుకు రోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పొదల్లో విషసర్పాలు ఉండటాన్ని రోగులు, సిబ్బంది పలుమార్లు గుర్తించారు. అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- తిరుపతి వైద్యం (ఆంధ్రజ్యోతి)

స్వచ్ఛభారత్‌కు ప్లాన్ చేసుకోండి



రోడ్డు పక్కన శుభ్రతను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మూడవ శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమానికి సన్నద్ధమవ్వాలని ఈవోపీఆర్డీ వెంకటరత్నం సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఉదయం మంగళంలోని సప్తగిరికాలనీ సచివాలయ పరిధిలో ఉన్న కరకంబాడీ మెయిన్‌రోడ్డు పక్కన చెత్తను తొలగిస్తుండడాన్ని ఆయన పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా, నివాసాల మధ్య చెత్త కనబడకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు జయశంకర్, లావణ్య, స్వాతిశ్రీ, నాగరాజు, మురళి పాల్గొన్నారు.

మహాశివరాత్రి మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సమీపంలోని కొత్రమంగళం రోడ్డు స్వర్ణముఖి నదీ తీరాన ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న మహాశివరాత్రి మహోత్సవ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. తిరుపతి నేరేలమ్మ ఆలయం వద్ద ఏకవీర ఫౌండేషన్ స్థాపకులు ప్రతాప్ స్వామి, బీజేపీ నేత గుండాల గోపినాథరెడ్డి ఆవిష్కరించారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

కూటమి ప్రభుత్వానికి బీసీలంటే చిన్నచూపు

టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుదేవ యాదవ్

తిరుపతి (జీవకోన), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూస్తోందని టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుదేవ యాదవ్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బీసీలకు అందులో ప్రత్యేకించి యాదవులకు పెద్దపీట వేయాలన్న ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం తనకు తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకులో వైస్ చైర్మన్ హోదాలో చాంబర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే తనకు కేటాయించిన చాంబర్‌ను తొలగించేలా చేశారని ఆరోపించారు. తనకు ఎటువంటి సమాచారమూ లేకుండా చాంబర్ తొలగింపుపై ఆర్‌సీఎస్, ఆర్బీఐలకు ఫిర్యాదు చేస్తానన్నారు.

కూటమి నాయకులు ఎవరినీ కించపరచలేదు

జనసేన నేత రాజేష్ యాదవ్

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు ఎవరినీ కించపరిచే విధంగా నడుచుకోలేదని జనసేన నేత రాజేష్ యాదవ్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ ఖ్యాతిని దిగజార్చే విధంగా వైస్ చైర్మన్ వాసుదేవ యాదవ్ తన చాంబర్‌ను బార్‌గా మార్చాడని, అందుకే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు దాన్ని తొలగించామని తెలిపారు. అయితే వైస్ చైర్మన్ కుల ప్రస్తావన తీసుకురావడం మంచి పద్ధతి కాదన్నారు. కమీషన్లు, ముడుపులకు అలవాటుపడి ఆయన అక్రమాలకు పాల్పడుతున్నారని, దీనిపై సిట్‌తో విచారణ జరిపించాలని కోరారు.

తల్లి మందలించిందని విద్యార్థి పరార్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నా సరిగా చదవడం లేదని తల్లి మందలించడంతో విద్యార్థి పరారైన ఘటన సింగాలగుంటలో గురువారం చోటుచేసుకుంది. సింగాలగుంటకు చెందిన సాయి శ్రీహరి ప్రైవేటు స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. పరీక్షలకు సరిగా ప్రిపేర్ కాకపోవడంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురైన శ్రీహరి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

వంశీ పాపం పండింది : తెలుగు యువత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వల్లభనేని వంశీ పాపాలు పండాయని, అందుకే పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్ పేర్కొన్నారు. నారా భువనేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే వంశీకి ఈ గతి పట్టిందని అన్నారు. వల్లభనేని వంశీ, దేవినేని అవినాష్, కొడాలి నాని రాష్ట్రానికి పట్టిన చీడ పురుగులని విమర్శించారు. మాజీ సీఎం జగన్ ప్రోద్బలంతోనే కొందరు వైసీపీ నేతలు శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా మాట్లాడుతున్నారని, అలాంటి వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు.

రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కపిలేశ్వరాలయంలో శనివారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయ బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకూ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి అభిషేకం, అలంకారం, శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకూ భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు.

మాతాశిశు మరణాలను అరికట్టండి

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతాశిశు మరణాలను అరికట్టాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం మాతాశిశు మరణాలపై డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, కమిటీ సభ్యులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ టీనేజీ ప్రెగ్నెన్సీ వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపైనా సూచనలు ఇవ్వాలన్నారు. సాధారణ ప్రసవాల శాతం పెంచాలని, అవసరమైతే తప్ప సిజేరియన్ చేయరాదని తెలిపారు. డీఐవో డాక్టర్ శాంతకుమారి, మెటర్నిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



ట్రాఫిక్ నియంత్రణను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎస్పీ హర్షవర్ధన రాజు గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. లీలా మహల్ జంక్షన్, సత్యనారాయణపురం, నంది సర్కిల్, అన్నారావు సర్కిల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. అన్ని కూడళ్లలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాయంత్రం విద్యాసంస్థలు వదిలిన సమయంలో ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రైనీ ఎస్పీతో పాటు ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి, మహిళా డీఎస్పీ శ్రీలత ఆయన వెంట ఉన్నారు. అనంతరం అలిపిరి పోలీసుస్టేషన్‌లో తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మసలుకోవాలని సూచించారు. అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రెక్కింగ్ క్లబ్ సభ్యులు



ట్రెక్కింగ్ క్లబ్ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి ట్రెక్కింగ్ క్లబ్ సభ్యులు గురువారం కలెక్టరేట్లో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరన్‌ను, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్‌ను కలిశారు. సీనియర్ జర్నలిస్ట్ రాఘవ రచించిన తిరుమల దృశ్య కావ్యం, శేషాచలం కొండల్లో పుస్తకాలను అందజేశారు. ట్రెక్కింగ్ గురించి కొంతసేపు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ట్రెక్కింగ్ క్లబ్ ప్రధాన సభ్యుడు మధు, రాఘవ, శ్రీహరి, తిరుమలరెడ్డి, నాగిరెడ్డి, శివారెడ్డి, బుర్ర మధు, రవి, కార్తీక్, జై బాలాజీ పాల్గొన్నారు.

చేతివృత్తులతో ఆర్థిక ప్రగతి



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తులతో మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించవచ్చని రాస్ డైరెక్టర్ వి.నాగరాజు వెల్లడించారు. రాస్ ఆధ్వర్యంలో జనశిక్షణ సంస్థాన్ వారి సౌజన్యంతో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు స్థానిక సప్తగిరినగర్‌లో గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. చేతివృత్తుల ద్వారా వచ్చే సంపాదనతో ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్, ఐద్వా నాయకురాలు డాక్టర్ పి.సాయి లక్ష్మి, కరుణాకర్, శ్రీలత, పద్మ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 13 (ఆంధజ్యోతి): తిరుపతిలో మార్చి 4, 5 తేదీల్లో నిర్వహించే వీధి వ్యాపారుల సంఘం తిరుపతి జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి కోరారు. బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నగర పరిధిలో తోపుడు బండ్ల వ్యాపారుల పట్ల అధికారులు, రాజకీయ నాయకులు అనుసరిస్తున్న తీరు బాధాకరమన్నారు. దీనిపై మహాసభల్లో చర్చించి, తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునీంద్ర, సీహెచ్ శివకుమార్, వైఎస్ మణి, గోవింస్వామి, కెవై రాజా, జాన్, జావిద్ పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు కార్మికులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు డిమాండ్ చేశారు. 16వ తేదీ తిరుపతిలో జరగనున్న కార్మిక సదస్సు జయప్రదం కోసం ముద్రించిన కరపత్రాలను గురువారం వారు విడుదల చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 2ను సవరించి అందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఎమ్మెల్సీ ఐ.వేంకటేశ్వరరావు, జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు హాజరుకానున్న ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రవి, ముత్తు, సూరి, గోపి పాల్గొన్నారు.

ఘనంగా కోదండరామస్వామి పేట ఉత్సవం



ఊరేగింపుగా వస్తున్న స్వామి అమ్మవార్లు - ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

తిరుపతి అర్బన్/తిరుపతి రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మాఘపౌర్ణమి సందర్భంగా కోదండరామ స్వామి పేట ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో పూజల అనంతరం ఉత్సవమూర్తులు ఊరేగింపుగా నగరానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని కూపుచంద్రపేటకు వేంచేపు చేశారు. ప్రత్యేక వేదికపై ఆసీనులను చేసి పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4-5 గంటల మధ్య ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి 9 గంటలకు బయలుదేరి కోదండరామస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఊరేగింపులో టీటీడీ హిందుధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో కళాకారుల భజనలు, కోలాటాలు అలరించాయి.దారిపొడవునస్వామి అమ్మవార్లను దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. జియ్యంగార్లు, డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కనువిందుగా ప్రణయ కలహోత్సవం



కుంభహారతి మండపం వద్దకు వేంచేపు చేస్తున్న స్వామివారు - స్వామి వారిపై పూలచెండు విసురుతున్న వేదపండితుడు

తిరుపతిఅర్బన్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం ప్రణయ కలహ మహోత్సవం కనువిందు చేసింది. అధ్యయనోత్సవాలలో భాగంగా ఏటా ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. సాయంత్రం 5 గంటలకు గోవిందరాజస్వామి పల్లకిలో ఆలయ ప్రాంగణంలోని కుంభహారతి మండపం వద్దకు, అమ్మవార్లు వేర్వేరు పల్లకిలో స్వామివారికి అభిముఖంగా వేంచేశారు. వేదపండితులు పురాణపఠనం చేస్తుండగా అమ్మవార్ల తరపున జియ్యంగార్లు పూలచెండ్లతో విహారయాత్రకు వెళ్లి వచ్చిన స్వామివారిని మూడుసార్లు తాకించారు. దీంతో స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడడమే ప్రణయ కలహ మహోత్సవ ఘట్టం. ఈ కార్యక్రమం ఆద్యంతం నయనానందకరంగా సాగింది. భక్తులు, స్థానికులు ఆసక్తిగా తిలకించి తన్మయత్వం చెందారు. అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా ఆసీనులై కర్పూరహారతులు అందుకుని ఆలయానికి వేంచేపుచేశారు. అనంతరం ఆస్థానం నిర్వహించారు. ఈ ఉత్సవంలో పెద్దజియ్యర్, చిన్నజియ్యర్, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

హెచ్‌ఎస్ ట్యాగింగ్‌పై అనుమానాలు వద్దు

ఇన్‌చార్జి కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి

తిరుపతి-ఆంధ్రజ్యోతి

రాష్ట్ర ప్రభుత్వం హౌస్‌హోల్డ్ (హెచ్‌ఎస్) జియో ట్యాగింగ్ సర్వే చేపడుతోంది. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో కొంతకాలంగా సమగ్ర సర్వే జరుగుతోంది. వివిధ కారణాలతో సంక్షేమ పథకాలకు దూరమైన వారిని గుర్తించడంతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. తిరుపతిలో పైలెట్ ప్రాజెక్టుగా భూముల వివరాలను కూడా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో డివిజన్ పరిధిలోని సచివాలయ కార్యదర్శులు ఇంటి యజమానులకు ఫోన్లు చేసి వివరాలు తీసుకునే ప్రయత్నంలో ఓటీపీ అడుగుతున్నారు. ఓటీపీ చెప్పేందుకు పలువురు అనుమానిస్తున్నారు. అలాంటి భయాందోళనలు ఉన్నవారు సచివాలయ సిబ్బందిని ఇంటిదగ్గరకు పిలిపించుకుని మ్యాపింగ్‌కు సహకరించాలని కార్పొరేషన్ అధికారులు కోరుతున్నారు.

85శాతం పూర్తిచేశాం: తిరుపతిలో 85 శాతం సర్వే పూర్తయింది. ఇంకా 17వేల హౌస్‌హోల్డ్ సర్వేలు పెండింగ్‌లో ఉన్నాయి. వారం రోజుల్లో 8వేలు రికార్డులు చేయించాం. విద్యుత్ 5వేలు, ఎన్టీఆర్ వైద్యసేవలో 6వేలు పెండింగ్ ఉన్నాయి. ఆయా శాఖల సహకారంతో వాటిని కూడా త్వరలోనే పూర్తిచేస్తాం. శిశు ఆధార్ లేని వారికి బర్త్ సర్టిఫికెట్ ఆధారంగా దగ్గర్లోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ), పోస్ట్ ఆఫీస్‌కు మ్యాప్ చేస్తాం. అక్కడ ఆధార్ నమోదు చేసుకోవచ్చు. బర్త్ సర్టిఫికెట్ లేకపోతే సచివాలయ అడ్మిన్ సెక్రటరీ మున్సిపల్ కార్యాలయం ద్వారా ఆధార్ ఇప్పించాలి. సచివాలయ సిబ్బందికి ఓటీపీ అయినా చెప్పొచ్చు. వేలిముద్ర అయినా వేయవచ్చు.

టీవీసీసీ సేవలను అడ్డుకున్న వెటర్నరీ విద్యార్థులు



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారమూ కొనసాగింది. ఇందులో భాగంగా తారకరామ వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ (టీవీసీసీ)వద్దకు చేరుకుని వైద్యసేవలను అడ్డుకున్నారు. క్లినికల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలను నిలిపివేశారు. అలాగే పశువైద్యులు అందిస్తున్న సేవలు, స్టైఫండ్ పెంపు అవశ్యకతను స్కిట్ రూపంలో ప్రదర్శించి వివరించారు. విద్యార్థులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌ని పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ సేవలను కూడా అడ్డుకుంటామని తెలిపారు.

గుంపులుగా వెళ్లండి

నడకమార్గంలో ఫారెస్ట్ సిబ్బంది



- చిరుత కలకలం నేపథ్యంలో భక్తులను అప్రమత్తం చేసిన అధికారులు

తిరుమల, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): అలిపిరి నడక మార్గంలోని ఏడోమైలు ముగ్గు బావి వద్ద గురువారం రాత్రి చిరుత కనిపించిందన్న భక్తుల కేకలతో అధికారులు అప్రమత్తమయ్యారు. విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. చిరుత అడవిలోకి వెళ్లిపోయిందని నిర్ధారించుకున్నాక భక్తులను గుంపులుగుంపులుగా అనుమతించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు భద్రతను కట్టుదిట్టం చేశారు.

ముక్కంటి ఆలయ హుండీ ఆదాయం రూ.2.04కోట్లు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. స్వామి అమ్మవార్ల గర్భాలయాల వద్ద ప్రధాన హుండీలతో పాటూ పరివార దేవతల హుండీలను గురువారం ఉదయం ఆలయంలో లెక్కించారు. మొత్తం 40 రోజులకు రూ.2.04కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు చెప్పారు. డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని కంపార్టుమెంట్లు,నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.37 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,270

తలనీలాలు సమర్పించినవారు: 22,175



మార్కెట్‌లో ప్రేమ సందడి





గుప్పెడంత గుండెలోని కొండంత ప్రేమను వ్యక్తం చేయాలి. మనసులో ప్రేమ గిలిగింతలు పెడుతున్న అమ్మాయి హృదయాన్ని గెల్చుకోవాలి. ఇందుకోసం అందమైన నాలుగు మాటలు, పదాలను పోగేసి కవిత చెబితే సరిపోతుందా..చాలదంటున్నారు ఈతరం ప్రేమికులు.. గుర్తుంచుకునేలా శుక్రవారం వేలెంటైన్స్ డేను సెలబ్రేట్ చేసుకోవాలనుకుంటున్నారు. వీరి మనసులోని భావాలను వ్యాపారంగా మార్చుకోడానికి మార్కెట్లు సిద్ధమయ్యాయి. ఇప్పటికే తిరుపతి నగరంలోని పలు గిఫ్ట్,ఫ్యాన్సీ షాపుల్లో ప్రేమికుల సందడి కనిపిస్తోంది. రకరకాల కేకులు,పుష్పాలు, బహుమతులు కొనుగోలుకు లవర్స్ సిద్ధమవుతున్నారు.







కాలిడి ప్రేమైక కుటుంబం

అపరంజి.. సుజాత



ప్రేమ పెళ్లిళ్లు చేసుకున్న అపరంజి సంతానం

ప్రేమంటే గుర్తుకు రావడం కాదు..జీవితాంతం గుర్తుంచుకోవడం అంటారు. పుత్తూరు పట్టణంలో అపరంజి కుటుంబాన్ని చూస్తే ఈ మాటలు అక్షరసత్యాలు అనిపించకమానదు. చాలామంది ప్రేమలు ప్రేమించడం అనే గడప దగ్గరే ఆగిపోతాయి. కానీ అపరంజి అలా కాదు. మనసిచ్చిన వారితోనే మనువు అని బలంగా విశ్వసించారు. ఒకసారి ఆయన ప్రేమ వివరాలు తెలుసుకుంటే.. దళిత సామాజికవర్గానికి చెందిన అపరంజి పేదరికంతో అష్టకష్టాలు పడ్డారు. డిగ్రీ పూర్తి చేశారు. ముద్దుకృష్ణమనాయుడు సిఫార్సుతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చిరుద్యోగిగా చేరారు. అంచలంచెలుగా ఎదిగి హిందీ అధ్యాపకుడు స్థాయికి చేరుకున్నారు. జూనియర్ కళాశాలలో పని చేస్తున్న సమయంలో అక్కడ అగ్రవర్ణానికి చెందిన సుజాతతో పరిచయమేర్పడింది. అది ప్రేమగా మారింది. కులాలు మతాలు అడ్డువచ్చినా కాదని తోసిపుచ్చారు. ప్రేమపక్షానే నిలిచారు. పెద్దల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. కానీ తాము పెళ్లితో ఒక్కటవుతామని పోలీసులు, పెద్దలకు తెగేసి చెప్పారు. ధైర్యంగా తిరుమలలో పెళ్లిపీటలెక్కారు. సమాజ ఆటు పోట్లకు వెరవకుండా కలిసి జీవితం సాగించారు. సుజాత ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత భర్తకు చేదోడువాదోడుగా ఉండాలని సంకల్పించింది. టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసింది. ప్రభుత్వ టీచరుగా ఎంపికైంది. పిల్లలు సాయిలక్ష్మి, దివ్యశ్రీ, సాయిప్రకాష్‌లను ఈదంపతులు బాగా చదివించారు. తాము అనుభవించిన ఇబ్బంది మరొకరికి ఎదురుకాకూడదని పెళ్లి విషయంలో పిల్లలకు స్వేచ్ఛనిచ్చారు. ముగ్గురు పిల్లలు సహోద్యోగులను ప్రేమించారు. దీంతో వీరంతా ప్రేమ వివాహాలే చేసుకున్నారు. వీరి కుటుంబంలో రెండోతరం ప్రేమ వారసులుగా నిలిచారు. **- పుత్తూరు, ఆంధ్రజ్యోతి**

'ప్రేమ'యుద్ధంలో గెలిచారు

కుమార్తెలు యక్షకుమారి, లిఖితలతో పురుషోత్తం, కృష్ణకుమారి దంపతులు

పురుషోత్తం, కృష్ణకుమారిల్లో చిన్నప్పుడు చిగురించిన స్నేహం ఎదిగేకొద్దీ ప్రేమ పుష్పమై వికసించింది. పెద్దయ్యాక అయినవారు కాదన్నా ఒప్పించి ఒక్కటయ్యారు. నాయుడుపేటకు చెందిన పురుషోత్తం, కృష్ణకుమారీల మధ్య ఏడో తరగతి చదువుతున్నప్పుడు స్నేహం ఏర్పడింది. తరువాత ఇంటర్మీడియట్‌లో వేర్వేరు గ్రూపులు తీసుకున్నా కలిసే చదివారు. డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 14 సంవత్సరాల వారి స్నేహం ప్రేమగా మారింది. 2002 సెప్టెంబరులో పురుషోత్తం ఇండియన్ ఆర్మీలో సోల్జర్‌గా ఎంపికయ్యాడు. ఈనేపథ్యంలో వీరి ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాలకు తెలిసింది. కృష్ణవేణి కుటుంబసభ్యులు అభ్యంతరం తెలియజేశారు. అయినప్పటికీ కృష్ణవేణి రెండేళ్లపాటు పెళ్లిచూపులు వాయిదావేస్తూ వచ్చింది. పురుషోత్తం వచ్చి తన మెడలో మూడుముడులు వేస్తాడని విశ్వసించింది. మిలటరీ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాక స్వస్థలానికి వచ్చారు. కృష్ణకుమారి తల్లిదండ్రులను, కుటుంబసభ్యులను ఒప్పించడంలో సఫలమయ్యారు. 2004 మే9న కృష్ణకుమారిని పెళ్లి చేసుకున్నారు. 2018 ఆగస్టు 31నపురుషోత్తం ఆర్మీలో హవల్దార్ హోదాలో రిటైరయ్యారు. ప్రస్తుతం ఆయన గ్రీన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్నారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

ప్రాణం తీసిన బనియన్

- తీసే క్రమంలో మెడకు బిగుసుకుని బాలుడి మృతి



తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిపై ఉన్న బనియన్‌ను తీసే క్రమంలో అది మెడకు బిగుసుకుపోవడంతో ఓ బాలుడు మృతిచెందాడు. తడ మండలం రామాపురం పంచాయతీ వెంకటాద్రి పాళెం గ్రామానికి చెందిన శరణేష్ (13) గురువారం ఇంటివద్ద స్నానం చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో బనియన్‌ను తీస్తుండగా అది ఓ పక్క మెడకు, మరోపక్క దుస్తులను తగిలించే స్టాండ్‌కు తగులుకుంది. ఊపిరి అందక అక్కడికక్కడే మృతిచెందాడు. స్నానానికి వెళ్లిన బాలుడు అరగంట అయినా రాకపోయే సరికి కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుకొట్టి చూడగా చనిపోయి ఉన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేయని సర్వర్లతో ఆగిన రిజిస్ట్రేషన్లు



మూసి ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో గురువారం సర్వర్లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగిపోయింది. ఉదయం నుంచి కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు చెందిన రైతులు, వ్యాపారస్తులు భూములు, ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చారు. సర్వర్లు మొరాయించడంతో సిబ్బంది చేతులు ఎత్తేశారు. దీంతో చేసేదిలేక ఆయా మండలాల రైతులు, వ్యాపారులు నిరాశతో వెనుదిరిగారు.

పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మీనాక్షి కంపెనీ (వేదాంత పవర్), సింహపురి జిందాల్ కంపెనీ, నవయుగ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సంబంధిత మ్యాప్‌లను పరిశీలించారు. ఎన్‌హెచ్‌ఏఐ నెల్లూరు వారితో పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి ఎంతో అనువైందని, తమ వంతు సహకారం అందిస్తామని పరిశ్రమలు ప్రతినిధులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఏపీఐఐసీ జెడ్‌ఎం నెల్లూరు శివకుమార్ పాల్గొన్నారు.

16న మంత్రి లోకేశ్ రాక

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఈనెల 16 ఉదయం 9.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు రోడ్డు మార్గాన నెల్లూరు వెళ్లి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహానికి హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు మళ్లీ విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదు వెళ్లనున్నారు.

జనసేన నేత కిరణ్‌రాయల్‌పై చీటింగ్ కేసు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) తిరుపతి నగర జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్‌పై యూనివర్శిటీ పోలీసులు గురువారం రాత్రి చీటింగ్ కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య కథనం మేరకు.. ఇటీవల కిరణ్‌పై వివిధ రకాల ఆరోపణలు, విమర్శలు చేసిన లక్ష్మీరెడ్డి రెండు రోజుల క్రితం కిరణ్‌రాయల్ ఇచ్చిన డబ్బు అడిగినందుకు తనను చంపుతానని బెదిరిస్తున్నాడని, మోసం చేసి అవమానకరంగా ప్రవర్తించాడని ఎస్వీయూ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ రామయ్య సెక్షన్ 420, 417, 506తో పాటు బీఎన్‌ఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

వ్యవసాయ కళాశాలకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి వ్యవసాయ కళాశాలకు గురువారం మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు ఆధ్వర్యంలో డాగ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది కళాశాలలో ముమ్మరంగా గాలించారు. ఎక్కడా బాంబులకు సంబంధించిన ఆనవాళ్లు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఐఐడీటీకి రూ.1.2 కోట్లు మంజూరు

తిరుపతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ (ఐఐడీటీ)కు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పథకాలు అమలు చేసేందుకు అదర్ గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద ఈ నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వెటర్నరీ వర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా చంద్రారెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా(ఏపీహైకోర్టు) అడ్వకేట్ ఆర్.చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ సెక్రటరీ జి.ప్రతిభాదేవి బుధవారం నియామక ఉత్తర్వులు వెలువరించారు. మూడేళ్లపాటు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ధ్వజస్తంభాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు,అర్చకులు

చంద్రగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఘనంగా కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈనెల 18నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న క్రమంలో ముందుగా ఈకార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాల పవిత్ర మిశ్రమంతో ప్రోక్షణ చేశారు. ఉదయం 11 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతించారు.

పల్లెపండుగ పనులను నెలాఖరుకు పూర్తి చేయాలి

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం పంచాయతీరాజ్, డ్వామా అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై వర్చువల్‌గా సమీక్షించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణంలో పురోగతి చూపాలన్నారు. పుత్తూరు, సత్యవేడు, నాగలాపురం, వడమాలపేట మండలాలు లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్నాయని, పురోగతి చూపాలని అన్నారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పీఆర్ ఈఈ, డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

రేపటి నుంచి అరుణాచలం ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తమిళనాడులోని అరుణాచలానికి డైలీ ప్యాకేజీ టూర్‌ను శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీనివాసం నుంచి వోల్వో ఏసీ బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలంలో బయల్దేరి సాయంత్రం 5 గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్, అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు బయల్దేరి రాత్రి 9 గంటలకు తిరుపతి చేరుకుంటుందని వివరించారు. పెద్దలకు రూ. 1200, పిల్లలకు రూ.960 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్లను ముందస్తుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూరిజం/ఏపీటీడీసీ.జీవోవీ.ఏపీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు 9848850099, 9848973985, 9848802099, 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో సహకార సూత్రాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన కార్యక్రమాలను పక్కాగా అమలుపరచాలన్నారు. టెక్నాలజీని వినియోగించి ప్రాథమిక సహకారపరపతి సంఘాలను బలోపేతం చేయనున్నట్లు వివరించారు. ప్రతి రైతూ ప్రాథమిక సహకారపరపతి సంఘాల్లో సభ్యులుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 18నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సహకార అవుట్‌రీచ్ క్యాంపెయిన్‌ని విజయవంతం చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీడీఎం నాబార్డ్ సునీల్, సీఈవో జుబేదబేగం పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ విజయవంతంపై సీఎం అభినందన

- జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషిచేస్తాం
- కలెక్టర్ వెంకటేశ్వర్



ఫ్లెమింగో ఫెస్టివల్ ఆల్బమ్‌ను విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : సూళ్లూరుపేట వేదికగా గత నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్-2025ను విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. గురువారం పర్యాటక రంగంపై వెలగపూడి సచివాలయంలో సమీక్షించిన సీఎం ఫ్లెమింగో ఫెస్టివల్ ఆల్బమ్‌ను విడుదల చేశారు. పుస్తకాన్ని అద్భుతంగా రూపొందించారని మంత్రి కందుల దుర్గేష్, అధికార బృందాన్ని అభినందించారు. ముఖ్యమంత్రికి కలెక్టర్ ధన్యవాదాలు తెలుపుతూ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఏపీపీగా బాలకృష్ణమ నాయుడు



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ప్రముఖ న్యాయవాది ముప్పారపు బాలకృష్ణమ నాయుడు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈయన తిరుపతి ఐదవ జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టులో మూడేళ్ల పాటు సేవలు అందించనున్నారు. గతంలో ఈయన అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్‌గా పనిచేసి ప్రభుత్వం నుంచి రెండుసార్లు ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా, నగర లీగల్ సెల్ అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం మరోసారి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది.

సాధువుల దీక్ష విరమణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అలిపిరి రోడ్డులో ఒబరాయ్ హోటల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రెండు రోజులుగా టీటీడీ పరిపాలనా భవనం వద్ద శ్రీనివాస ఆనంద సరస్వతి ఆధ్వర్యంలో సాధువులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గురువారం రాత్రి విరమించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో ఈస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ దీక్షా శిబిరం వద్దకు చేరుకుని వారికి నచ్చజెప్పి, నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.





ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యలను త్వరతగతిన పరిష్కరించేలా చొరవ చూపాలని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ అట్రాసిటీ సభ్యుడు తాజుద్దీన్ అన్నారు. గురువారం తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవిందనాయక్, సురేంద్రబాబు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి అన్నారు. గురువారం స్థానిక సాయిబాబా మందిరంలో లక్ష్మీశంకర్ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వ ర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదంలో చక్కని చికిత్సలు ఉన్నాయన్నారు. ఆయుర్వేద చికిత్సతో ఎటువంటి దుష్పరిణామాలు ఉండవన్నారు. అనంతరం డాక్టర్ శంకర్ పేదలకు వైదపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి కురుగొండ్ల నివాళి



డక్కిలి, ఫిబ్రవరి 13 : (ఆంధ్రజ్యోతి) : డక్కిలి మండలం కమ్మవారిపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయకులు ఈతముక్కల వెంకటసుబ్బానాయుడు కర్మక్రియలు గురువారం కమ్మవారిపల్లి జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హాజరై వెంకటసుబ్బానాయుడు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు నల్లాని రామచంద్రయ్య, రాంబాబు, కురుగొండ్ల శ్రీనివాసులు, పచ్చూరి నరసయ్య తదితరులు ఉన్నారు.

పెండింగ్ అర్జీలు పూర్తి చేయండి

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అర్జీలు త్వరగతిన పూర్తిచేయాలని గూడూరు ఆర్డీవో రాఘవేంద్ర మీనా సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ అర్జీలు ఎక్కువగా ఉన్నాయని వీఆర్‌వోలు 17వ తేదీలోగా వాటికి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఆర్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలాయపల్లి: ఫ్రీ హోల్డ్‌లో గుర్తించిన భూములను మళ్లీ సమీక్షించి సమగ్ర నివేదిక రూపొందించాలని బాలాయపల్లి తహసీల్దార్‌ను ఆర్డీవో ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో రాఘవేంద్రమీనా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్టీవో కిషోర్ కుమార్

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని గూడూరు ఆర్టీవో కిషోర్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో సింహపురి యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. బస్సు డ్రైవర్లు విధిగా ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. అనంతరం సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహపురి యూత్ అసోసి యేషన్ అధ్యక్షుడు గుడిమెట్ల ఉదయ్‌కుమార్, డిపో మేనేజర్ రామకృష్ణ, సభ్యులు ప్రవీణ్‌కుమార్, సాయి నికేష్, రాకేష్, యూనియన్ నాయకులు రత్నం ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

నైమిశారణ్య పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



డక్కిలి, ఫిబ్రవరి 13 : (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్‌లోని నైమిశారణ్య పుణ్యక్షేత్రంలో అక్కడి ప్రభుత్వం టూరిజం శాఖ, వికాస్ పరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సత్యనారాణ స్వామి వ్రతంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సంతోషాలతో జీవించాలని ప్రార్థించినట్లు వివరించారు.

చిన్నారికి పింఛను కోసం కృషి



చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యంతో ఇబ్బంది పడుతున్న చిన్నారికి పింఛన్ మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని న్యాయవాదులు భరోసా ఇచ్చారు. శ్రీకాళహస్తి తుఫాన్ సెంటర్ ఎస్టీ కాలనీకి చెందిన దంపతులకు ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. చిన్నతనంలో తీవ్ర జ్వరంతో ఫిట్స్ రావడంతో మానసిక వైకల్యం ఏర్పడిందని శ్రీకాళహస్తి అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ దృష్టికి వెళ్ళింది. న్యాయ సేవ వారోత్సవాల్లో భాగంగా చిన్నారి కుటుంబాన్ని పరామర్శించాలని న్యాయమూర్తి లీగల్ ఏయిడ్ కౌన్సిల్ న్యాయవాదులకు సూచించారు. ఇందులో భాగంగా గురువారం న్యాయవాదులు తుఫాన్ సెంటర్ చేరుకుని బాలుడి పరిస్థితిపై ఆరా తీశారు. వివరాలను న్యాయమూర్తికి నివేదిస్తామని చెప్పారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, రమేష్ బాబు, శ్రీరామ్, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తడ రైల్వే స్టేషన్ ఆవరణలో వాహన స్టాండ్ ఏర్పాటు

తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తడ రైల్వే స్టేషన్ సమీపంలో ద్విచక్రవాహన పార్కింగ్ స్టాండ్ త్వరలో అందు బాటులో రానుంది. కొంతకాలంగా రైల్వేస్టేషన్ సమీపంలో బైక్‌లను పార్కింగ్ చేస్తుండగా అవి చోరీకి గురవుతుండటంతో వాహనదారులు నష్టపోతున్నారు. అందులో ముఖ్యంగా శ్రీసిటీ సెజ్‌లోని ఉద్యోగుల వాహనాలు ఉండటంతో విషయాన్ని శ్రీసిటీ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన శ్రీసిటీ చెన్నై రైల్వే అధికారులకు వాహనాల పార్కింగ్ స్టాండ్ ఏర్పాటు చేయాలని కోరింది. దీంతో రైల్వే అధికారులు చెన్నైకు చెందిన ఇండియా నీడీ పీపుల్స్ చారిటబుల్ ట్రస్టుతో మూడేళ్ల పాటు స్టాండ్ ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. మరి కొద్దిరోజుల్లో స్టాండ్ అందుబాటులోకి రానుంది.

సంపద తయారీకేంద్రాల తనిఖీ

తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాదలూరు, వెండ్లూరుపాడు పంచాయతీలలో చెత్త సంపద తయారీకేంద్రాలను డీఎల్‌పీవో రవీంద్రబాబు గురువారం తనిఖీ చేశారు. వర్మీకం పోస్టు తయారీ చేసి రైతులకు ఉపయోగపడేలా వాటిని అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడిచెత్తలను సేకరించాలని ఆదేశించారు. ఆయనతోపాటు పంచాయతీ కార్యదర్శులు శేషారావు, లక్ష్మీప్రసన్న ఉన్నారు.

నేడు సదరన్‌రైల్వే డీఆర్ఎం పర్యటన

తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : చెన్నై సదరన్ రైల్వే డీఆర్ఎం విశ్వనాథ్‌ఈర్యా గూడూరు సబ్ డివిజన్‌లో పర్యటించనున్నారు. ప్రత్యేక రైలులో గూడూరుకు వచ్చి అక్కడ తనిఖీల అనంతరం నాయుడుపేట, సూళ్లూరుపేట, తడలలో జరుగుతున్న పలు రైల్వే పనులను ఆయన పరిశీలించనున్నారు. సూళ్లూరుపేటలో ఉన్న ఎల్‌సీ నెంబరు 60, రైల్వేగేట్‌ను పరిశీలించి అక్కడ అండర్‌బ్రిడ్జి నిర్మాణస్థలాన్ని పరిశీలించనున్నారు. అక్కడ నుంచి ఆయన నేరుగా చెన్నైకు వెళ్లనున్నారు.

చిన్నారుల మెదడుకు పదును



మాట్లాడుతున్న సూపర్ వైజర్ కవిత

కోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన ప్రతి చిన్నారి మెదడుకు పదునుబెట్టి విధిగా అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత అన్నారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంగన్వాడీ వర్కర్లకు 'పోషణ్ బీ పడాయి బీ' శిక్షణ కార్యక్రమం జరిగింది. మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో తొలిరోజు అంగన్వాడీల కేంద్రాలలో బోధించే విద్య, సంపూర్ణ ఆరోగ్యం, తదితర అంశాలపై ఆయా వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా అధికారులు మాట్లాడుతూ ప్రతిబిడ్డతోపాటు తల్లి ఆరోగ్యంగా ఉండాలని ఇందుకోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు చంద్రశేఖర్

గూడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రీసర్వే కార్యక్రమం ద్వారా భూసమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుంటుందని తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నిర్వహించే సమయంలో రైతులు అందుబాటులో ఉండి సర్వేకు సహకరించాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.

రోడ్డు భద్రతపై ర్యాలీ



మానవహారం చేస్తున్న టీఎంఆర్ విద్యార్థులు

చిట్టమూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాలపై గురువారం టీఎంఆర్ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ చిన్న బలరామయ్య ఆధ్వర్యంలో టీఎంఆర్ విద్యా సంస్థ కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్ఐ నాగేశ్వరావు, ప్రిన్స్‌పాల్ రహంతుల్లా, మేనేజర్ ఆశ శ్రీనివాసులు, విద్యార్థులు కొత్తగుంటలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు.

సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలకు

గ్రేడ్-2 హోదా ఎప్పుడో..?

ప్రతిపాదనలతో సరి ● మున్సిపాలిటీలుగా మారి 12 ఏళ్లయినా గ్రేడ్-3 హోదాలోనే ● కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ చిగురించిన ఆశలు



సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ కార్యాలయాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలుగా అవతరించి పన్నెండేళ్లయింది. అయినా నేటికీ గ్రేడ్-3 హోదాలోనే ఉన్నాయి. గ్రేడ్-2గా మార్చేందుకు అన్ని హంగులున్నా కార్యరూపం దాల్చలేదు. ఈ రెండు మున్సిపాలిటీలు జాతీయ రహదారిని అనుకొని చెన్నై, నెల్లూరు నగరాలకు దగ్గరగా ఉండడంతో ఈ ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడడంతో పాటు రాబడి బాగా పెరిగింది. గ్రేడ్-2 మున్సిపాలిటీల స్థాయికి చేరాయి. ఆ మేరకు గ్రేడ్-2 పురపాలక సంఘాలుగా మార్పు చేయాలని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆయా కౌన్సిళ్లు తీర్మానాలు చేశాయి. ఆ మేరకు ప్రభుత్వానికి 2023లోనే ప్రతిపాదనలు పంపారు. అయితే ఏళ్లు గడుస్తున్నా నేటికీ అమలుకాలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో గ్రేడ్-2 హోదా వస్తుందని పట్టణ వాసులకు మళ్లీ ఆశలు చిగురించాయి.

మున్సిపాలిటీలుగా మారి పన్నెండేళ్లు..

సూళ్లూరుపేట, నాయుడుపేట మేజర్ పంచాయతీలను 2012 జనవరిలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేడ్-3 మున్సిపాలిటీలుగా మార్చుచేసింది. ఆనాటి నుంచి రెండు ప్రాంతాల్లో మున్సిపాలిటీ పాలన ప్రారంభమైంది. అయితే అప్పటికీ, ఇప్పటికీ 12 ఏళ్లలో మున్సిపాలిటీ స్వరూపంలో భారీగా మార్పులు వచ్చాయి. రెండు మున్సిపాలిటీల్లో జనాభా సైతం పెరిగారు. రాబడి రూ.5 కోట్లకు పైగా దాటింది. భౌగోళిక విస్తీర్ణం పెరిగింది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలను గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2గా మార్పు చేయాలంటూ కౌన్సిళ్లు తీర్మానం చేసి ప్రతిపాదనలు సీడీఎంఏ కార్యాలయానికి పంపాయి. పంపి రెండేళ్లయినా అతీగతీ లేదు. అన్ని హంగులున్న ఈ మున్సిపాలిటీలకు గ్రేడ్-2 హోదా తీసుకురావడంతో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాల్సి ఉంది.

పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి..

రెండు మున్సిపాలిటీలు పారిశ్రామికంగా పరుగులు తీస్తున్నాయి. శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు సూళ్లూరుపేటలో నివాసం ఉంటున్నారు. అదేవిధంగా మేనకూరులో పనిచేసే వారు నాయుడుపేటలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం రెండు మున్సిపాలిటీలు గ్రేడ్-3 పరిధిలో ఉండడంతో అభివృద్ధికి నిధులు చాలడం లేదు. అదే గ్రేడ్-2 ఆమోదం పొందితే ప్రభుత్వ నిధుల కేటాయింపులు ఎక్కువగా ఉంటాయి. మౌలికవసతులకు పెట్టపీట వేయవచ్చు. ప్రస్తుతం కమిషనర్‌కు రూ.20 వేలు వరకు మాత్రమే పరిపాలన ఆమోదం ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత ఈ రెండు పట్టణాలు మరింత అభివృద్ధి చెందాయి. భూముల ధరలకు సైతం రెక్కలు వచ్చాయి.

గేడ్-2గా మార్పు చెందితే కలిగే ప్రయోజనాలు..

మున్సిపాలిటీలు గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కు మార్పు అయితే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. జనాభా నిష్పత్తిని అనుసరించి నిధులు కేటాయింపు చేస్తారు. ప్రభుత్వం నుంచి పరిపాలన ఆమోదం మేరకు కమిషనర్‌కు రూ.50 వేలు వరకు ఉంటుంది. పనులు వేగవంతంగా జరుగుతాయి. ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. కమిషనర్‌ను గ్రూపు-1 ఆఫీసర్లను నియమిస్తారు.

గ్రేడ్-2 మున్సిపాలిటీలకు అర్హతలు

- జనాభా 50 వేలుకు పైగా ఉండాలి.
- ఆదాయం రూ.3 కోట్లు పైగా ఉండాలి.
- విస్తీర్ణం 20 చ.కి.మీలు ఉండాలి.
- ఇతర మౌలిక సదుపాయాలు తప్పని సరి

ప్రస్తుతం సూళ్లూరుపేట పరిస్థితి

- జనాభా 56 వేలు పైబడి ఉన్నారు.
- ఆదాయం సుమారు రూ.9 కోట్లు పైనే
- విస్తీర్ణం 21 చ.కి.మీలు మేర ఉంది.

నాయుడుపేట పరిస్థితి

- జనాభా 55 వేలు
- ఆదాయం రూ.5 కోట్లు
- విస్తీర్ణం సుమారు 28 చ.కి.మీలు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలి



గురుకులం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హేమంత్, లక్ష్మీనారాయణ తదితరులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక హేమంత్ కోరారు. అసోసి యేషన్ క్యాలెండర్‌ను ఎల్ఏసాగరంలోని గురుకులంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ రంగాలలో, గురు కులాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్కాస్ సిబ్బంది, ఏజెన్సీలలో ఉన్నటువంటి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆయా ప్రభుత్వ సంస్థలకు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులాల కాంట్రాక్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, జయశేఖర్, దేశయ్య, రత్నం, శ్యామ్, సాయి, సురేష్, రాజేష్, తదితరులు ఉన్నారు.

సంపద కేంద్రాల పరిశీలన



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రవీంద్రబాబు, పక్కనే ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సతీష్ తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలోని ఇలుపూరు, మంగళంపాడు, దామానెల్లూరు గ్రామాల్లో ఉన్న సంపద కేంద్రాలను గురువారం డీఎల్‌పీవో సీహెచ్ రవీంద్ర బాబు పరిశీలించారు. ఇన్నాళ్లు నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రాలను మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం చొరవతీసుకొంటుంది. ఈ నేపథ్యంలో డీఎల్‌పీవో ఆ కేంద్రాలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా సక్రమంగా అందేలా చూడాలన్నారు. అదే విధంగా వీధి దీపాలు అన్ని చోట్ల వెలిగేలా చూడాల్సిన బాధ్యత కార్యదర్శిలదేనన్నారు. ఈ కార్యక్రమంలో మంగళంపాడు సర్పంచ్ తోట రుక్మిణి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు టీడీపీ నాయకులు సతీష్, శేషాద్రి ఉన్నారు.

లారీ బోల్తా .. డ్రైవర్‌కు గాయాలు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు లోని శ్రీపెరంబుదూరు నుంచి ఇనుప స్క్రాబ్ లోడుతో వెళ్తున్న లారీ సూళ్లూరుపేటలోని జాతీయ రహదారి వట్రపాలెం సమీపంలో గురువారం అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్ నడివేలుకు స్వల్పగాయాలయ్యాయి. బోల్తాపడిన లారీని హైవే అత్యవసర సిబ్బంది క్రేన్ తెప్పించి వెలికితీశారు.

రైలుఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలోని దక్షిణ వైపున గురువారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి ఎరుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుంది. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసస్తున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గూడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని సీడీపీవో మోహబూబి అన్నారు. గురువారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నతపాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ్ బీ పడాయ్ బీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు పోషకవిలువలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. పోషకవిలువలపై అవగాహన పెంపొందించేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కాంచన, మాధవిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిటౌన్: పోషణ బీ పడాయి బీ శిక్షణా కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీపీడీవో షంషాద్ బేగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాబయ్య, విజయ శ్రీ, హెచ్ఎం వాణి తదితరులు పాల్గొన్నారు.

వాకాడు : మండలంలోని ఎఫ్ఏఎల్‌టీఈఎఫ్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సీడీపీవో సూపర్‌వైజర్ బుజ్జమ మూడు రోజుల శిక్షణలో భాగంగా తొలిరోజు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏఎల్‌సీఎఫ్ ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ బుజ్జమ్మ

పరిశుభ్రత అందరి బాధ్యత

పెళ్లకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రతతోనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ప్రమీలారాణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. కార్యదర్శి శ్రీహరి ఉన్నారు.

టీచర్‌పై డీడీఈవో విచారణ

ఓజిలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముమ్మాయపాళెం ప్రాథమిక పాఠశాల (ఎస్టీ) ఉపాధ్యాయుడు శేఖర్‌పై గురువారం ఎంఈవో కార్యాలయంలో విచారణ జరిగింది. గూడూరు డిప్యూటీ డీఈవో సనత్‌కుమార్ విచారణలో చేపట్టారు. నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన ఉపాధ్యాయుడు శేఖర్‌కు అతని సోదరుడికి మధ్య ఆస్తి వివాదం ఉన్నది. దీంతో శేఖర్‌పై జిల్లా ఉన్నతాధి కారులకు అతని సోదరుడు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాలతో డిప్యూటీ డీఈవో విచారణ చేశారు. ఓజిలి ఎంఈవో శైలజ పాల్గొన్నారు.

మంత్రిని కలసిన టీడీపీ నేతలు



నాయుడుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను అమరావతిలో గురువారం తిరుపతి పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, టీడీపీ నేతలు కందలకృష్ణారెడ్డి, కామిరెడ్డి అశోక్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో, సూళ్లూరుపేట నియోజకవర్గంలో గత భూసర్వేలోని అవకతవకలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు తెలిపారు. సకాలంలో రెవెన్యూ సమస్యలు పరిష్క రిస్తామని మంత్రి తెలియజేశారని వారు పేర్కొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనుల పరిశీలన

పిచ్చాటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.38 లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

ప్రతి శనివారం ప్రజా దర్బార్

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనుందని ఎంపీడీవో కోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ 15వ తేదీన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని వివరించారు.

గురుదక్షిణామూర్తికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో కొలువై ఉన్న దక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గురుదక్షిణామూర్తి సన్నిధిని మంత్ర జలాలతో శుద్ధి చేశారు. అనంతరం కలశ స్థాపనతో భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. విశేష అభిషేకాలు నిర్వహించి స్వర్ణ కవచంతో అలంకరించారు. ధూప, దీప, నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

సరైన వసతులు లేక విద్యార్థుల అవస్థలు

గూడూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 140 మంది వరకు చదువుతున్నారు. ప్రహరీ కొంతమేర కూలిపోయింది. ఈ ప్రహరీ ఆనుకుని చిన్నపాటి చెరువు ఉండడంతో విద్యార్థులు ఆడుకునే సమయంలో ప్రమాదాలకు లోనవు తారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లకు తలుపులు ధ్వంసమై అధ్వానంగా ఉన్నాయి. దీంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. రెండో విడత నాడు- నేడు ద్వారా కొత్తగా మరుగుదొడ్ల నిర్మా ణాలు చేపట్టారు. అయితే నిధుల కొరత కారణంగా ఆరు నెలలకు పైగా ఈ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇక పశువులు సైతం క్రీడామైదానంలోకి వస్తుండడంతో ఆవరణం అపరి శుభ్రంగా మారింది. అలాగే తరగతిగదుల వెనుక వైపు చెట్లు ఎక్కువగా ఉండడంతో పాముల బెడద వేధిస్తోంది. ఇకనైనా అధికారులు స్పందించి కూలిపోయిన ప్రహరీని నిర్మించడంతో పాటు అసంపూర్తిగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు. పరిసరాలలోని చెట్లపొదలను తొలగించాలని కోరుతున్నారు.



దెబ్బతిని ఉన్న ప్రహరీ, చెట్లతో నిండిపోయిన తరగతిగది వెనుక ప్రదేశం ● ప్రస్తుత మరుగుదొడ్లకు పాడైపోయి ఉన్న తలుపు



అసంపూర్తిగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం

విజ్ఞానగిరిపై అపచారం!

● గర్భగుడి ముందే బిర్యానీ తిన్న భవన నిర్మాణ కార్మికులు



గర్భగుడి ఎదుట చికెన్ బిర్యానీ తింటున్న కార్మికుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న విజ్ఞానగిరి కొండపై అపచారం జరి గింది. నిర్మాణ పనులు సాగించే కొందరు కార్మికులు గర్భగుడి ముందే చికెన్ బిర్యాని తింటున్న దృశ్యాలపై సర్వత్ర విమర్శలకు దారి తీసాయి. విజ్ఞానగిరిపై కుమారస్వామి కొలువై ఉన్న విషయం తెలిసిందే. నిత్యం ఇక్కడ ధూప, దీప, ఆరాధనలు సాగుతుంటాయి. ము క్కంటి ఆలయం ద్వారా సెక్యూరిటీ పర్యవేక్షణ కూడా కొనసాగుతోంది. నాలుగు రోజుల క్రితం భీష్మ ఏకాదశి ఉత్సవం కూడా విజ్ఞానగిరిపై విశేషంగా నిర్వహించారు. గర్భగుడి వద్ద ఆలయ ప్రాంగణ విస్తరణ కోసం స్లాబు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం గర్భగుడి ముందు ధ్వజస్తంభం పక్కనే కార్మికులు చికెన్ బిర్యాని తింటున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పవిత్ర విజ్ఞానగిరిపై అపచారం జరిగిందంటూ భక్తులు మండిపడు తున్నారు. ఆలయాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఏమయ్యారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కోలాహలంగా బీజేపీ సమావేశం



సామంచి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సర్వసభ్య సమావేశం కోలాహలంగా జరిగింది. పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం పార్టీ బలోపేతంపై సమావేశం జరిగింది. ఇందులో భాగంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించి భరతమాత చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయంపై సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మండల, పోలింగ్ బూత్‌ల కమిటీల నియామకాన్ని పూర్తి చేశామన్నారు. ప్రతి కార్యకర్తా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, జిల్లా కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ మునిసుబ్రమణ్యం అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వ హించారు. మునిసుబ్రమణ్యం, గురుదేవ్, ఢిల్లీ ప్రకాష్, సిద్దులయ్య తదిరులు పాల్గొన్నారు.

సమష్టిగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అందరూ కలసి పని చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రేఖ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అరణియార్ ప్రాజెక్టులో గత ఆరేళ్లుగా ఏటా సుమారు 10 లక్షల చేప పిల్లలను తన చేతులు మీదుగా వదిలానన్నారు. దీంతో మత్స్య కార్మికుల అభ్యున్నతికి కృషి చేశానన్నారు. జైకా నిధులు రూ.35 కోట్లతో చేపట్టిన అరణియార్ ఆధునికీకరణ పనులు నత్తనడకన జరగడంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. రేషన్ కార్డు, ఇంటిపట్టా లేని వారు, ఇళ్లు లేని లబ్ధిదారులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో మహ్మద్‌రఫి, తహసీల్దార్ జయరాం, వివిధ శాఖల తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడిని తరలిస్తున్న స్థానికులు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని లారీ ఢీ కొనింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమా చారం అందించారు. సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ మల్లికార్జున క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. వాహనం రావడం ఆలస్యం కావడంతో ఎస్ఐ తన వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో బీఎన్‌కండ్రిగ వద్ద అంబులెన్స్ రావడంతో బాధితుడిని అందులో తరలించారు.

పుత్తూరు వార్తలు

ఎన్‌సీసీ క్యాడెట్లకు సన్మానం



పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ జెండాలతో క్యాడెట్లు

పుత్తూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు అపున్ పాల్‌రాజ్, పవన్ సహా వారి తల్లిదండ్రులను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ... దేశ రాజధానిలో జరిగే రిపబ్లిక్ వేడుకల్లో కవాతు చేసే అవకాశం తమ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లకు రావడం అదృష్టమన్నారు. దేశంలో అతి పెద్ద యూనిఫాం కలిగిన ఎన్‌సీసీ సంస్థ దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇస్తోందన్నారు. ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు కోటేశ్వరయ్య, వాణిశ్రీ, దేవకి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కావమ్మ తిరునాళ్లు



పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎన్ రోడ్డులో కొలువై ఉన్న బెస్తకుల దైవం కావమ్మ ఆలయ తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం కావమ్మ, మారయ్యలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 9 గంటలకు బుర్రకథ, 10 గంటలకు కావమ్మ సారె పంపిణీ నిర్వహించారు. అనంతరం కావమ్మ, మారయ్య ఉత్సవమూర్తులను పట్టణంలో ఊరేగించారు. ఆ కార్యక్రమానికి ఉభయదారులుగా కంచి చెంగయ్య కుటుంబీకులు వ్యవహరించారు. కేసీ మధు, ఉమా మహేశ్వర్, లవకుమార్, సాయి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గృహ సందర్శనతో క్రమశిక్షణ

వడమాలపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల గృహ సందర్శనతో చిన్నారులు రోజా హాజరవుతారని సూపర్‌వైజర్ మనీలా, చెప్పారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ గృహ సందర్శనపై శిక్షణ ఇచ్చారు. తల్లిదండ్రులకు పిల్లల అభివృద్ధి, పోషణ వంటి వాటిపై అవగాహన కల్పించాలని కోరారు. గర్భిణులకు పౌష్టికాహారం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అన్నదానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. జనసేన తొట్టంబేడు మండల ఇన్‌చార్జి చంద్రశేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, బాల సుబ్రమణ్యం, వెంకటరమణయాదవ్, ఉదయ్, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దోపు ఉత్సవం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరాలయంలో దోపు ఉత్సవం వేడుకగా జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో పంచమూర్తులను అర్చకులు విశేషంగా అలంకరించి హారతు లను సమర్పించారు. అనంతరం భిక్షాల గాలి గోపురం నుంచి సంప్రదాయబద్ధంగా దోపు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లతోపాటు శివ పరివార ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించారు. ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే పొర్లుతున్న మందుబాబులు

దాబాలు, కూల్ డ్రింక్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు



బాబు అగ్రహారం పురపాలక పాఠశాల గేటు వద్ద పూటుగా తాగి అడ్డంగా పడుకున్న మందుబాబు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో అక్రమ మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. దాబాలు, కూల్ డ్రింక్ షాపులు బహిరంగ మద్యం కేంద్రాలుగా మారిపోతున్నాయి. వేకువ జాము నుంచే మందుబాబులు తూలి పడుతున్నారు. ఫ్యామిలీ దాబాల పేరుతో రాత్రిపగలూ తేడా లేకుండా మందుబాబులు విందులతో చిందులేస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక కూల్ డ్రింక్ షాపులైతే బార్లను తలపిస్తున్నాయి. మందుబాబులు మితిమీరి తాగి రోడ్లపైనే శయనిస్తున్నారు. తాజాగా పట్టణ నడిబొడ్డున బాబు అగ్రహారంలో గురువారం ఉదయం మందుబాబు ఏకంగా పాఠశాల గేటు ముందే అడ్డంగా పడుకున్నాడు. శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఆనుకొని ఈ పాఠశాల ఉండడం గమనార్హం. పట్టణ కేంద్ర బిందువు కావడంతో నిత్యం వందలాది మంది ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. స్కూలు గేటు ముందరే తాగుబోతు అడ్డంగా పడుకొని ఉన్న దృశ్యాలను చూసిన స్థానికులు ఇదేం చోద్యం అంటున్నారు. బహిరంగంగా మద్యం తాగే వారిపై చర్యలు తీసుకునే అధికారులు... బహిరంగంగా మద్యం అక్రమంగా విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలానికి పల్లె పండుగలో మంజూరైన రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో త్రివిక్రమ్ రావు ఆదేశించారు. పల్లె పండుగలో సిమెంట్ రోడ్ల పనులకు రూ.2.66 కోట్లతో 54 పనులు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు 33 పనులు పూర్తయ్యాయని మిగతా 21 రోడ్లను ఈనెలాఖరులోగా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఈ నాగరాజు, ఏపీవో భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్లైవుడ్ లారీకి పట్టకడుతూ జారి పడ్డ డ్రైవర్



చికిత్స పొందుతున్న ఖలీల్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): లారీలోని ప్లైవుడ్ లోడ్‌కు పట్టకడుతుండగా కిందకు జారి పడడంతో డ్రైవర్ గాయపడ్డాడు. కడపకు చెందిన ఖలీల్ లారీ డ్రైవర్. గురువారం తొట్టంబేడు మండలం రౌతుసూరమాలలోని ప్లైవుడ్ పరిశ్రమకు లారీతో వచ్చాడు. అక్కడ లోడ్ చేసుకున్నాడు. పట్టకట్టేందుకు పరిశ్రమకు చెందిన హమాలీలు సహకరించలేదు. దీంతో లారీపైకెక్కి పట్టకడుతుండగా అదుపుతప్పి కింద పడడంతో నడుము ఎముకలు విరిగాయి. అనంతరం పరిశ్రమ సిబ్బంది వ్యానులో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చి వదిలేసి వెళ్లిపోయారు. గమనించిన సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రుయాకు రెఫర్ చేశారు.

చెత్త తొలగేనా?



బుగ్గవీధిలో, కరిమారియమ్మ ఆలయం పక్కన నిండిపోయిన చెత్తకుండీలు

రేణిగుంట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెత్త కుండీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. దీంతో పరిసరాల్లో దు ర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు సమస్యలు పరిష్కరించాలంటూ పంచాయతీ కార్మికులు రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయింది. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని పంచాయతీ కార్యదర్శి ప్రకటనతో పారిశుధ్య గురువారం సాయంత్రం పనుల్లోకి దిగారు. మరి పట్టణంలో పేరుకున్న చెత్త ఎన్ని రోజుల్లో తొలగిస్తారో వేచి చూడాల్సి ఉంది.

పల్లె వెలుగు బస్సులో రగడ

రేణిగుంట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి - రేణిగుంట మార్గంలో నడిచే పల్లె వెలుగు బస్సులో ఓ ప్రయాణికుడు, కండక్టర్ మధ్య వాగ్వాదంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. బస్సును వంతెనపై ఆపేసిన సంఘటన గురువారం రాత్రి రేణిగుంట పట్టణం వద్ద జరిగింది. రేణిగుంట నుంచి తిరుపతికి వెళ్తున్న పల్లె వెలుగు బస్సులో ఓ ప్రయాణికుడు ఎక్కాడు. స్కానర్ పనిచేయకపోవడంతో డబ్బులిచ్చి టిక్కెట్ తీసుకోవాలని కండక్టర్ తెలిపారు. ఈ క్రమంలో ప్రయాణికుడు తన దగ్గర నగదు లేదని చెప్పాడు. దిగేసి మరో బస్సు ఎక్కాలని కండక్టర్ సూచించారు. దీంతో ప్రయాణికుడు ఆగ్రహంతో ఊగిపోయాడు. ఎక్కడ ఎక్కించుకున్నారో అక్కడే దింపాలంటూ భీష్మించాడు. దీంతో రేణిగుంట వంతెనపై బస్సు చాలా సేపు కదలకుండా నిలిచిపోయింది. ప్రయాణికులు కలుగజేసుకుని ఆ ప్రయాణికుడి ఫోన్‌పే నుంచి మరొకరికి నగదు పంపించి వారి ద్వారా నగదు ఇచ్చి టిక్కెట్టు కొనుగోలు చేయడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం బస్సు ముందుకు కదిలింది.

'కాంప్లెక్స్' సమావేశాల వేళలు మార్చండి

ఏపీటీఎఫ్ డిమాండ్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల సమయంతో అసౌకర్యం కలుగుతుందని.. సమయాన్ని మార్చాలని ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మురళీకృష్ణ బి. బాలసుబ్రమణ్యం డిమాండు చేశారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో గురువారం విద్యాశాఖ విడుదల చేసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలపై ఇబ్బందులను వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం ఉపాధ్యాయులు ఉదయం 9గంటలకు నుంచి 11.45 వరకు పాఠశాల విధులు నిర్వహించుకుని మధ్యాహ్నం 1గంటకు సమావేశాలకు హాజరు కావాలన్నారు. ఈ విధానం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. సమావేశాలు జరిగే రోజున 11.45కు పాఠశాల నుంచి పంపడం వల్ల విద్యార్థులు ఇంటికి చేరేందుకు తగిన ప్రయాణ సౌకర్యాలు లేక ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయన్నారు. కాంప్లెక్స్ సమావేశాలు 5 గంటల వరకు నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులు ఇంటికి చేరేందుకు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయన్నారు.

ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఉదయం పిచ్చాటూరులో సిమెంటు రోడ్లు, మినీ గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి జాబ్‌కార్డుకు వంద రోజులు పని కల్పించాలన్నారు. కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఏపీవో నాగభూషణమ్మ, జేఈ, సాంకేతిక, క్షేత్ర సహాయకులను ఆదేశించారు. అలాగే ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చే యాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో మహ్మద్‌రఫి, ఏపీవో చంద్రశేఖర్‌రాజు, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వాలీశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే

పిచ్చాటూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరిలో కొలువై ఉన్న వాలీశ్వరస్వామిని ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేకు దర్శనభాగ్యం కల్పించారు. ఎమ్మెల్యేకు గ్రామ పెద్దలు, ఈవో ఆలయ మర్యాదలు చేయగా, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఈవో లతతో కలసి మహా శివరాత్రి బ్రహ్మోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి, పద్దురాజు పాల్గొన్నారు.

టీడీపీ నేత మనోహర్‌కు ఎమ్మెల్యే నివాళి

అడవికొడియంబేడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మనోహర్ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం ఉదయం అడవికొడియంబేడులోని మనోహర్ స్వగృహానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

మా అధీనంలో ఉన్న భూమికి పట్టాలివ్వండి

తహసీల్దార్‌కు దళితుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళితులు

కేవీబీపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తమ అధీనంలో ఉన్న భూములకు పట్టాలివ్వాలని దళితులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని రాజుల కండ్రిగకు చెందిన దళితులు 15 సంవత్సరాల క్రితం ప్రభుత్వ భూమిలో మామిడి మొక్కలు నాటి సాగు చేసుకుంటున్నారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కొంతమంది వీరి సాగులో ఉన్న సర్వే నెం.254లో భూమిని పట్టా చేసుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో గురువారం దళితులు తమ అధీనంలో ఉన్న భూమికి పట్టాలివ్వాలని తహసీల్దార్ మునిరత్నంరెడ్డికి వినతి పత్రాన్ని అం దించారు. స్పందించిన తహసీల్దార్ వీఆర్వోను, ఆర్ఐను, సర్వేయర్‌ను పంపి పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రక్తదాన శిబిరం



రేణిగుంట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నమాచార్య కళాశాల సహకారంతో గురువారం కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాస్ బాలాజీ బాల వికాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి, కేవీకే ఇన్‌చార్జి శ్రీనివాస్, కళాశాల సిబ్బంది, రుయా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిను కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఆలయ ఈవో బాపిరెడ్డి అందజేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాలను ఈ ఏడాది అంగరంగ వైభోవంగా నిర్వహిస్తున్నట్లు ఆయనకు తెలిపారు.

'తండేల్' బృందానికి సాదర వీడ్కోలు



రేణిగుంట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు నాగ చైతన్య, నటి సాయి పల్లవి, నిర్మాత అల్లు అరవింద్‌కు తిరుపతి విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. తండేల్ సినిమా విజయవంతం కావడంతో శ్రీవారిని దర్శించుకుని గురువారం ఉదయం విమానాశ్రయం చేరకున్న వారికి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు సాదర వీడ్కోలు పలికారు. అనంతరం ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

రెవెన్యూ సదస్సులో అర్జీలపై అలసత్వం వద్దు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై అలసత్వం వహించడం సరికాదని తహసీల్దార్ సుబ్రమణ్యం హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇప్పటి వరకు పలువురు వీర్వోలు అర్జీలపై నత్తనడకన విచారణలు చేపడుతున్నారని మండిపడ్డారు. ప్రతి అర్జీపై విచారణ జరిపి సమస్య పరిష్కరించాలన్నారు. అదే విధంగా మ్యుటేషన్లపై నివేది కలు సిద్ధం చేయాలన్నారు. ఆర్ఐ నల్లయ్య పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

నారాయణవనం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీళగరంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన వ్యక్తి బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఈనెల 4వ తేదీ కీలగరం బీసీ కాలనీలో ధర్మలింగం ఇంటి వెనుక అదే గ్రామానికి చెందిన మణికంఠన్‌కు చెందిన స్థలంలో పేడ దిబ్బల కారణంగా గొడవ పడ్డారు. ఈ క్రమంలో ధర్మలింగం ఇంట్లో భోజనం చేస్తుండగా, మణికంఠన్ తన అనుచరులతో దాడి చేశాడు. దాడిలో ధర్మలింగం, అతని పెద్దకుమారుడు లోకేష్ గాయపడ్డారు. తలకు తీవ్ర గాయాలైన ధర్మలింగం తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.